రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త



## ఇంకా 25 శాతం సర్ ప్రక్రియ పెండింగ్

**శామీర్‌పేట, జులై 26, ప్రభాతవార్త :** ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కీసర సర్కిల్ ఎఎంసి (ఎఇఆర్ఓ) మధుసూదన్‌రెడ్డి సమీక్షించారు. శామీర్‌పేట డివిజన్-300పరిధిలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ గడువు సమీపిస్తున్నందున ఫారాలను త్వరగా స్వీకరించటానికి రాజకీయ పార్టీల నాయకులతో ఆయన తూంకుంటలోని కార్యాలయంలో అఖిలపక్ష రాజకీయ నాయకుల సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగ ఎఎంసి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ సర్ ఫారాలను పూర్తి చేసి బిఎల్ఓలకు అప్పగించాలన్నారు. సర్ గడువు ముగింపు సమీపిస్తున్నందున వెంటనే తిరిగి ఫారాలను ఇవ్వటానికి ఓటర్లకు సూచించాలని కోరారు. ఎస్ఐఆర్ ఫారాలు నింపకుంటే బిఎల్ఓలను సంప్రదించి తెలుసుకుని నింపి సమర్పించాలన్నారు. ఎన్యుమరేషన్ ఫారాలను నింపి పూర్తి చేయటానికి అన్ని పార్టీల నాయకులు, బిఎల్ఎలు సహకారంను అందించాలన్నారు. ఇప్పటి వరకు డివిజన్‌లో ఫారాలు పంపిణీ చేసిన వాటిలో 75శాతం పూర్తి జరిగినట్లు, 25శాతం ఫారాలు అందాల్సి ఉందని అన్నారు. ప్రజలను, ఓటర్లను బిఎల్ఎలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఫారాలను నింపి ఇవ్వటానికి సహకరించాలని గడువు ఆగస్టు 3వ తేదీ వరకు ఉన్నప్పటికీ ఈ నెల 31వ తేదీలోపు అందజేయాలని, ఆ తరువాత వాటిని డిజిటలైజేషన్ చేయాల్సి ఉంటుందని ఓటరు ఫారాలు నింపి సకాలంలో ఇవ్వాలని ప్రజలను చైతన్యం చేయాలని బిఎల్ఓలకు సహకరించాలని మధుసూదన్‌రెడ్డి కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఆర్టీఎ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, శామీర్‌పేట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు నక్క సందీప్‌గౌడ్, మండల సిపిఐ కార్యదర్శి నరేంద్రప్రసాద్, నాయకులు టిఆర్ రవీందర్‌గౌడ్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎఎంసి మధుసూదన్‌రెడ్డి




## అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

### జిల్లాలో 62 మందికి అవకాశం

### 27నుంచి దరఖాస్తుల స్వీకరణ

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై 26, ప్రభాతవార్త:** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో అంగన్‌వాడీ టీచర్ల ఖాళీలను భర్తీ చేయటానికి నోటిఫికేషన్ జారీ అయింది. జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ నుంచి అంగన్‌వాడీ టీచర్స్ ఖాళీ పోస్టుల భర్తీకి ఉత్తర్వులు ఈ నెల 23న జారీ చేశారు. ఈ నెల 27వ తేదీ నుంచి ఆగస్టు 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసు కోవాలని సూచించారు. 2026 జూలై 1వ తేదీ వరకు 18సంవత్సరాల నుంచి 35సంవత్సరాలలోపు వారై ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలని సూచించారు. అంగన్‌వాడి కేంద్రంకు సంబంధించి స్థానికులైన వారు దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

జిల్లాలో 62 అంగన్‌వాడి టీచర్ల పోస్టులు ఖాళీలు ఉన్నట్లు వివరించారు. అల్వాల్ ప్రాజెక్టులో 18పోస్టులు, మేడ్చల్ ప్రాజెక్టులో 20పోస్టులు, కుత్బుల్లాపూర్ ప్రాజెక్టులో 24పోస్టులు ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. దఖాస్తులు వెబ్‌సైట్ ఆన్‌లైన్‌లో ధరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు చేసుకున్న వారు జిరాక్స్ పత్రులను గెజిటెడ్ అధికారి ద్వారా అటెస్టెడ్ ధృవీకరించబడి ఉండాలని సూచించారు. వీటిని గడువులోగా ఈ నెల 27నుంచి ఆగస్టు 5వ తేదీలోపు సర్టిఫికెట్స్‌ను వివరాలను పూర్తిగ ప్రాజెక్టు కార్యాలయాల్లో సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఈ నోటిఫికేషన్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి ద్వారా జిల్లా సంక్షేమ అధికారి శారద నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. అంగన్‌వాడి టీచర్ ఖాళీ పోస్టులకు సంబంధించి వివరాలకు అల్వాల్, మేడ్చల్, కుత్బుల్లాపూర్ ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాల్లో, మేడ్చల్ జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో తెలుసుకోవచ్చు.

●వికారాబాధ

## కరువు కమ్మేస్తోంది

### జిల్లాలో బీడువారిన 1.22 లక్షల ఎకరాల సాగుభూమి

### సాధారణ సాగు విస్తీర్ణం 4.85 లక్షల ఎకరాలు

### 3.63 లక్షల ఎకరాలకే పరిమితం

### ప్రధాన పంటల్లో వెనకడుగు



ఆశించిన స్థాయిలో ఎదగని కంది పంట

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** వర్షాధారిత పంటలను ఎల్‌నినో దారుణంగా దెబ్బతిస్తోంది. భారీ ప్రాజెక్టులు లేని వికారాబాద్ జిల్లాలో వానాకాలం పంటలే వేసుకుంటారు. ఈసారి ఆశించిన స్థాయిలో పంట చేతికి వచ్చే పరిస్థితులు కనిపించడం లేదు. కరువు ప్రభావం చూపవచ్చని రైతులు ఆందోళన చెందుతున్నారు. సకాలంలో వర్షాలు కురిస్తేనే పునాస పంటలు వేసుకుంటారు. నాలుగు మాసాల పాటు సాధారణ వర్షపాతం నమోదైతేనే దిగుబడులు సాధ్యమవుతాయి. కానీ గడచిన 50 రోజులలో దాదాపు సగం మండలాల్లో వర్షపు లోటు నమోదైంది. ఇది ఆందోళన గురి చేసే అంశంగా భావిస్తున్నారు. ఈ యేడాది జిల్లాలో స్థూల సాగు విస్తీర్ణం 4.85 లక్షల ఎకరాలు ఉండగా 3.63 లక్షల ఎకరాలకే పరిమితమైంది. అంటే 1.22 లక్షల ఎకరాలు సాగుకు దూరంగా ఉన్నాయి.

వికారాబాద్ జిల్లాలో ఉన్న నల్లరేగడి నేలల్లో అధికంగా పత్తి, కంది సాగు చేస్తారు. ఎర్ర నేలలు, చెలక నేలల్లో కూడా పంటలు పండిస్తారు. పత్తి, కంది పంటలే కాకుండా వరి, పెసర, మినుము, మొక్కజొన్న, జొన్న, నల్ల కంది, చెరుకు, వేరుశనగ సాగు చేసుకుంటారు. వర్షపు నీటి ద్వారా సాగు చేసే ప్రధాన పంటలో పత్తి 2.46 లక్షల ఎకరాలలో పండిస్తారు. కానీ ఈసారి 2.22 లక్షల ఎకరాలకే పరిమితం చేశారు. 1.30 లక్షల ఎకరాలలో పండించే కంది పంటను ఈసారి 95 వేల ఎకరాలకే పరిమితమైంది. అయితే, ముమ్మందు వర్షాలు కురుస్తాయనే నమ్మకంతో వానాకాలం వరి పంటను



దారూర్ చెరువులో చుక్క నీరు లేని దుస్థితి

### 27 వేల ఎకరాల నుంచి 2 వేల ఎకరాలకు దిగజారిన కూరగాయల సాగు

ఎప్పటిలాగే 15 వేల ఎకరాలలో వేసుకున్నారు. 46 వేల ఎకరాలలో వేసుకోవాల్సిన మొక్కజొన్న పంట సాగు 32 వేల ఎకరాలే విత్తుకున్నారు. పెసర పంట 14 వేల ఎకరాల నుంచి 5 వేల ఎకరాలకే పరిమితం కావడం గమనార్హం. మినుములు కూడా 6 వేల ఎకరాల నుంచి 800 ఎకరాలకు పడిపోవడం వర్షాకాలం పరిస్థితులను అంచనా వేయవచ్చు. జొన్న, సోయాబీన్ పంటలూ సగానికి సగం వేసుకోలేదు. కూరగాయల సాగు కూడా గణనీయంగా తగ్గిపోయింది. 27 వేల ఎకరాలలో పండించే కూరగాయలను కేవలం 2 వేల ఎకరాలకే పరిమితం చేశారు. అయితే, కూరగాయలు నిరంతరంగా బోరుబావుల కింద పండిస్తుంటారు. భూగర్భజలాలు అడుగంటడం వల్ల బోరుబావులపై నమ్మకం కుదరడం లేదు. రానున్న రెండున్నర నెలల్లో కురిసే వర్షాల ఆధారంగా యాసంగి పంటలపై అంచనాలు తయారు చేయనున్నారు.

**భారీ ప్రాజెక్టులు ఎందుకు కట్టలేదంటే..**

జిల్లాలో పుట్టిన మూసీ, ఈసీ నదులు రాజధాని హైదరాబాద్ నగరానికి మంచినీటిని అందించే ప్రధాన వనరులు. వికారాబాద్, పూడూరు, నవాబ్‌పేట, శంకర్‌పల్లి, షాబాద్ మీదుగా ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాలకు వర్షపు నీరు చేరుతుంది. జంటనగరాలకు మంచినీటిని అందించే వనరులకు ఎలాంటి ఆటంకం కలుగకుండా నిజాం కాలం నుంచి ఫర్మనా (నిబంధనలు) అమలులో ఉన్నాయి. అనంతరం 111 జీవోనెంబర్ అమలవుతోంది. ఈ జిల్లా నుంచి రెండు జలాశయాల వరకు మూసీ, ఈసీ నదులపై ఎలాంటి ప్రాజెక్టులు నిర్మించరాదన్న నిబంధనలు పగడ్బంధీగా అమలువుతున్నాయి. అంతెందుకు పూడూరు, నవాబ్‌పేట మండలాల్లో పెద్దగా చెర్వులు కూడా నిర్మించలేకపోయారు. ఇక ధారూరు, బొంరాస్‌పేట మండలాల్లో పుట్టిన కాగ్నా, కాకరవేణి నదులపై కూడా ఆశించిన స్థాయిలో ప్రాజెక్టులు నిర్మించడంలో పాలకులు విఫలమైనారు. ఈ రెండు నదులపై కేవలం చెక్‌డ్యామ్‌లు మాత్రమే నిర్మించి వదిలిపెట్టారు. యాలాల వద్ద కాకరవేణి నదిపై శివసాగర్ పేరుతో సగం వరకు నిర్మించిన చిన్ననీటి ప్రాజెక్టును 20 ఏళ్లుగా ముందుకు సాగడం లేదు. కోటపల్లి, జుంటుపల్లి, లఖ్నాపూర్, నందివాగు, సర్పన్‌పల్లి, కొంశెట్టిపల్లి, జినుగుర్తి, శ్రీరాములవారి ప్రాజెక్టులు కలిపి వాటి కింద ఆయకట్టు భూములు 20 వేలకు మించడం లేదు. కాగ్నా జలాలను 6 టీఎంసీల వరకు వికారాబాద్ ప్రాంతం రైతులకు వినియోగించే హక్కులు ఉన్నాయని కేంద్ర జలనవరుల సంఘం ఏనాడో తేల్చిచెప్పినా ఒక్క టీఎంసీ కూడా ఉపయోగించకపోవడం పాలకుల పనితీరుకు అద్దం పడుతుంది. 1985లో కాగ్నా నదిపై ఏర్పాటు చేసిన ఐదు లఘు ఎత్తిపోతల పథకాలు నిరుపయోగంగా మారాయి. లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల కింద కూడా వెయ్యి ఎకరాలకు మించి సాగు చేయలేదు. ఇంతటి దయనీయ పరిస్థితుల్లో ఉన్న వికారాబాద్ జిల్లాకు కృష్ణా జలాలు వస్తేనే రైతుల జీవితాల్లో ఆశలు చిగురించనున్నాయి.

## ఫార్మా భూనిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

**యాచారం, జులై 26, ప్రభతవార్త :** ఫార్మా భూసేకరణలో సమ్మతి తెలపని రైతులకు న్యాయం చేయాలని భూసేకరణ వ్యతిరేక కమిటీ స్వచ్ఛంద కర్త కవుల సరస్వతి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మేడిపల్లి, నానాక్నగర్, తాటిపర్తి, కుర్మిద్ద, మర్లకుంట, మంగళ్లడ్డ తండల్లో ఇప్పటి వరకు భూమి ఇయ్యని రైతులందరి భూములు భూసేకరణ నుంచి మినహాయింపు చెయ్యాలన్నారు.భూములు ఇయ్యని రైతులందరి పేర్లు ఆన్లైన్‌లో వెంటనే ఎక్కించాలని వారి భూములని నిషేధిత జాబితా నుంచి తొలగించాలి, రిజిస్ట్రేషన్ హక్కులు కల్పించాలన్నారు. మేడిపల్లి, నానాక్నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో ఉన్న కూలిలందరికి 2013 చట్ట ప్రకారం సరైన నష్టపరిహారం, పునరావాసం ఇచ్చే వరకు కోర్టు ఆదేశాల ప్రకారం నాలుగు గ్రామాల్లో భూమి స్వాదిన పర్చుకోకూడదు కాబట్టి ఇప్పుడు కోర్టు ఆదేశాలని దిక్కరిస్తూ, చేస్తున్నటువంటి పనులన్నీ నిలుపుదల చెయ్యాలి. ఊర్లలో ఉన్న జె సి బి లని హిటచిలాని, టిప్పర్లు వంటి వాహనాలంన్నిటిని, చట్ట వ్యతిరేకంగా వేసిన కంటైనర్లని అన్నిటిని తీసివేయ్యాలన్నారు. కోర్టు ఆదేశాలకి వ్యతిరేకంగా కుర్మిద్ద రెవెన్యూ లో కడుతున్న గ్రీన్ ఫీల్డ్ రోడ్డు పనులు నిలుపుదల చెయ్యాలని రోజు ఊర్లలో తిరుగుతూ రైతులని బెదిరిస్తున్న రెవిన్యూ మరియు టీజీ ఐఐసి సిబ్బందిని, పోలీసులని ఊర్లలో వెళ్లకుండా ఆదేశాలు ఇయ్యాలని డిమాండ్ చేశారు. నాలుగు గ్రామాల్లో కూలీలందరికి నష్టపరిహారం, పునరావాసం కల్పించాలి, మేనిఫెస్టోలో మాట ఇచ్చిన విధంగా ఫార్మసిటీ ని సమూలంగా రద్దు చెయ్యాలని, ఫార్మా సిటీజి. ఓని రద్దు చేసాం అని ప్రభుత్వ అధికారిక ఉత్తర్వులు విడుదల చెయ్యాలన్నారు.

కేవలం ఫార్మసిటీ రద్దు చేసాం అని నోటి మాటలు, చెప్తే సరిపోదు. ఫార్మా సిటీ స్థానంలో ఏ ప్రాజెక్టు పెడుతున్నారో, ఏ కంపెనిలు పెడుతున్నారో వాటి పూర్తి సమగ్ర వివరాలు, ప్రాజెక్ట్ రిపోర్టులు తెలుగులో ఇచ్చి, ప్రతి గ్రామంలో ప్రజా అభిప్రాయ సేకరణ సభ ఏర్పాటు చేసి, ప్రజల అంగీకారంతో మాత్రమే ఎటువంటి కంపెనీ అయినా, ప్రాజెక్ట్ అయినా పెట్టాలి అన్నారు. ప్రజాస్వామ్యంలో అందరికీ స్వేచ్ఛ ఉందని స్వేచ్ఛని హరించరాదన్నారు. ప్రకృతి పేదల మనుగడకు ఇబ్బంది కలగరాదన్నారు.

## కేంద్ర మంత్రులకు ఘన స్వాగతం





కిషన్‌రెడ్డి, సంజయ్‌కు స్వయంగా డోలు వాయిస్తూ స్వాగతం పలుకుతున్న బిజెపి జిల్లా నాయకులు

**శామీర్‌పేట, జులై 26, ప్రభాతవార్త :** కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌లకు బిజెపి శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. ఆదివారం మధ్యాహ్నం శామీర్‌పేట మండలం అలియాబాద్ చౌరస్తా రాజీవ్‌రహదారిన కేంద్ర మంత్రులకు బిజెపి నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. నగరం నుంచి కొమురవెల్లి మల్లన్న రైల్వేస్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాజీవ్‌రహదారిన వెళ్తూ ఉండటంతో అలియాబాద్ చౌరస్తా వద్ద బిజెపి శ్రేణులు గజమాలలతో మంత్రులకు ఘనంగా స్వాగతం పలికారు. కోట్లాది మంది భక్తుల ఆరాధ్య దైవం కొమురవెల్లి మల్లన్న స్వామి ఆలయ సమీపంలో నూతనంగా కొమురవెల్లి మల్లన్న రైల్వేస్టేషన్ నిర్మాణం పూర్తి జరగటంతో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రారంభించటానికి, అదే విధంగా దీనిలో పాల్గొనటానికి కేంద్ర మంత్రి బండి సంజయ్‌లు వేరువేరుగా రాజీవ్‌రహదారిన కాన్వాయ్‌లో వెళ్తూ అలియాబాద్ చౌరస్తా వద్ద వారిని బిజెపి శ్రేణులు ఆపి వారికి ఘనంగా స్వాగతం పలికారు. కొమురవెల్లి మల్లన్న రైల్వేస్టేషన్ ప్రారంభంతో తెలంగాణ ప్రాంత భక్తులకు శ్రీమల్లన్నను దర్శించుకోవటానికి మరింత సౌకర్యం కలుగుతుందని అన్నారు. మేడ్చల్ జిల్లా బిజెపి రూరల్ అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్, శామీర్‌పేట మండల బిజెపి అధ్యక్షులు కొరివి కృష్ణ, అలియాబాద్ మున్సిపల్ వైస్‌చైర్మన్ కె.మాలతిమాదవరెడ్డిల ఆధ్వర్యంలో కేంద్ర మంత్రులకు ఘనంగా స్వాగతం పలకటానికి ఏర్పాట్లు జరిగాయి. అలియాబాద్ మున్సిపల్ వైస్‌చైర్మన్ కె.మాలతిమాదవరెడ్డి కేంద్ర మంత్రులకు స్వాగతం పలకటానికి క్రేయిన్ ద్వారా గజమాల వేయటానికి ఏర్పాట్లు చేశారు. మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు వేరువేరుగా విచ్చేయటంతో ఆపటంతో బిజెపి నాయకులు వారిని కలిసి ఘనంగా స్వాగతం పలకటం జరిగింది. వారు కొమురవెల్లి వెళ్తూ బిజెపి శ్రేణులకు అభివాదం చేస్తూ అలియాబాద్ చౌరస్తా నుంచి కొమురవెల్లిలో రైల్వేస్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కాన్వాయ్‌గా వెళ్లటం జరిగింది. కేంద్ర మంత్రులకు గొల్ల, కురుమల డోలు వాయిద్యాలతో గజమాలలతో స్వాగతం పలికటంతో రాజీవ్‌రహదారి అలియాబాద్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ కొంత సేపు అంతరాయం ఏర్పడింది. రాజీవ్‌రహదారిన కేంద్ర మంత్రుల రాకల సందర్భంగా జీనోమ్‌వ్యాలీ పోలీస్‌స్టేషన్ సిఐ గురువయ్యగౌడ్ ఆధ్వర్యంలో అలియాబాద్ చౌరస్తా వద్ద పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయటం జరిగింది. కేంద్ర మంత్రులకు ఘనస్వాగతం పలికిన ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బిజెపి రూరల్ అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్, జిల్లా మాజీ అధ్యక్షులు పి.విక్రమ్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఏనుగు సుదర్శ న్‌రెడ్డి, జిల్లా అర్బన్ అధ్యక్షులు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి, ఎన్.హైమారెడ్డి, అలియాబాద్ మున్సిపల్ వైస్‌చైర్మన్ కె.మాలతిమాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కారు బోల్తా - నలుగురికి గాయాలు

**పెద్దేముల్, జులై 26, ప్రభాతవార్త:** కారుబోల్తా పడి నలుగురికి గాయలైన సంఘటన పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరు పట్టణం ఇందిరానగర్‌కు చెందిన నలుగురు కుటుంబ సభ్యులు హైద్రాబాద్ నుంచి తాండూరుకు కారులో వస్తుండగా పెద్దేముల్ మండలం కందనెల్లి మలుపు వద్ద అదుపుతప్పి బోల్తా కొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలయ్యాయి, వారిని వెంటనే 108 అంబులెన్స్‌లో తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కారు టైరు పగలడంతోనే బోల్తా కొట్టిందని స్థానికుల సమాచారం.

## విత్తన మేళాను సద్వినియోగం చేసుకోవాలి

**పెద్దేముల్, జులై 26, ప్రభాతవార్త:** ఈ నెల 27, 28,29 తేదిలలో జిల్లాలోని ఆయా మండలాల రైతు వేదికలలో నిర్వహించే విత్తన మేళాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ఎంఏ సత్తార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సత్తార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయశాఖ, ఉద్యానశాఖల సమన్వయంతో ఈ నెల 27 నుంచి 29 వరకు మూడు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా విత్తనమేళా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ విత్తనమేళా ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాల లభ్యత, వివిధ పంటలకు అనువైన విత్తన రకాలు, ఆధునిక సాగు పద్ధతులు ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ, ఉద్యాన పంటలపై సాంకేతిక అవగాహన కల్పించబడుతుందని అన్నారు. మండల రైతు వేదికలో మూడు రోజుల పాటు నిర్వహించే విత్తనమేళాకు తప్పనిసరిగా హాజరై నాణ్యమైన విత్తనాలు, సాంకేతిక సలహాలు, ప్రభుత్వ పథకాల వివరాలను తెలుసుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం ద్వారా శాస్త్రీయ పద్ధతులను అవలంబించి అధిక దిగుబడులు సాధించాలని కోరారు.



## షాద్‌నగర్ తేజం..

### అంతరిక్ష శాస్త్రంలో యువ ఇంజనీర్ సరికొత్త రికార్డు

### విక్రమ్1 విజయంలో కీలక పాత్ర పోషించిన నిఖిల్

### ఒకవైపు స్పేస్ మిషన్లు, మరోవైపు కాన్వాస్‌పై చిత్రలేఖనంతో స్ఫూర్తి!

**షాద్‌నగర్, జులై 26, ప్రభాతవార్త :** భారత అంతరిక్ష రంగంలో ప్రైవేట్ సంస్థల సత్తాను ప్రపంచానికి చాటిన స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ రూపొందించిన విక్రమ్1 రాకెట్ విజయవంతమైన ప్రయోగంలో షాద్‌నగర్‌కు చెందిన యువ ఏరోస్పేస్ శాస్త్రవేత్త నిఖిల్ మద్దూరి కీలక పాత్ర పోషించారు. విక్రమ్1 మిషన్ కంప్యూటర్ కోసం అత్యంత కీలకమైన రాకెట్ నావిగేషన్ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించి అభివృద్ధి చేయడంలో ఆయన విశేష కృషి చేశారు.నిఖిల్ మద్దూరి ఐఐటీ ఖరగ్‌పూర్‌లో బీటెక్ పూర్తి చేశారు. అనంతరం ఎరాస్మస్ ముండస్ స్కాలర్‌షిప్ ద్వారా జర్మనీలోని వుర్జ్‌బర్గ్‌లో ఉన్న జూలియస్ మాక్సిమిలియన్స్ విశ్వవిద్యాలయం, స్వీడన్‌లోని ఎల్‌టీయూ విశ్వవిద్యాలయాల్లో స్పేస్‌మాస్టర్ కోర్సును అభ్యసించి డబుల్ మాస్టర్స్ డిగ్రీలు పొందారు. గతంలో భారత రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఏడీఏ)లో ఏరోస్పేస్ శాస్త్రవేత్తగా పనిచేసిన నిఖిల్, ఎల్‌సీఏ తేజస్ స్వదేశీ యుద్ధ విమానాల అభివృద్ధికి సంబంధించిన ప్రాజెక్టుల్లో సేవలందించారు. గత ఆరు సంవత్సరాలుగా స్కైరూట్ ఏరోస్పేస్‌లో జీఎన్‌సీ (గైడెన్స్, నావిగేషన్ అండ్ కంట్రోల్) ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. రాకెట్ నావిగేషన్ సాఫ్ట్‌వేర్ రూపకల్పన విక్రమ్1 మిషన్ కంప్యూటర్‌లో కీలకమైన నావిగేషన్ సాఫ్ట్‌వేర్‌ను నిఖిల్ మద్దూరి రూపొందించి అభివృద్ధి చేశారు. రాకెట్‌లో అమర్చిన వివిధ సెన్సార్ల నుంచి అందే సమాచారాన్ని ఆధారంగా చేసుకుని రాకెట్ యాటిట్యూడ్, పొజిషన్, వేగాన్ని అంచనా వేయడంలో ఈ నావిగేషన్ సాఫ్ట్‌వేర్ కీలకంగా పనిచేస్తుంది. ఈ నావిగేషన్ అల్గారిథమ్‌ను గతంలో నిఖిల్ పనిచేసిన బృందం స్కైరూట్ ఏరోస్పేస్‌కు చెందిన సబ్‌ఆర్బిటల్ రాకెట్ విక్రమ్‌ఎస్‌పై విజయవంతంగా పరీక్షి ంచింది. 2022 నవంబర్ 18న శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి విక్రమ్‌ఎస్‌ను ప్రయోగించారు. తొలి ప్రయత్నంలోనే ఈ ప్రయోగం విజయవంతం కావడం ద్వారా స్కైరూట్ ఏరోస్పేస్ ఆధ్వర్యంలో యువ భారతీయ శాస్త్రవేత్తలు రూపొందించిన తొలి ప్రైవేట్ సబ్‌ఆర్బిటల్ రాకెట్‌గా విక్రమ్‌ఎస్ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. విక్రమ్1 విజయంతో మరో మైలురాయి భారతదేశపు తొలి పూర్తిస్థాయి ఆర్బిటల్ శ్రేణికి చెందిన వాణిజ్య ఉపగ్రహ ప్రయోగ వాహనంగా రూపొందిన స్కైరూట్ విక్రమ్1 రాకెట్ జూలై 18, 2026న మధ్యాహ్నం 12:05 గంటలకు విజయవంతంగా ప్రయోగించబడిన నేపథ్యంలో నిఖిల్ మద్దూరి కృషి మరోసారి ప్రశంసలు అందుకుంటోంది.స్కైరూట్ ఏరోస్పేస్ వ్యవస్థాపకులు పవన్ కుమార్ చందన, నాగ భరత్ డాకా దార్శనికతతో పాటు వారి ఆధ్వర్యంలో పనిచేసిన శాస్త్రవేత్తలు, ఇంజనీర్ల ఆరేళ్ల అవిశ్రాంత కృషికి విక్రమ్1 విజయం ప్రతిబింబంగా నిలిచింది. తొలి ప్రయత్నంలోనే విక్రమ్1 విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లి ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశపెట్టడం భారత ప్రైవేట్ అంతరిక్ష రంగానికి గర్వకారణంగా నిలిచింది.ఈ చారిత్రక విజయానికి నావిగేషన్ శాస్త్రవేత్తగా నిఖిల్ మద్దూరి అందించిన సాంకేతిక సహకారం ప్రత్యేకంగా ప్రశంసించదగినదని పలువురు అభినందిస్తున్నారు. యువ భారతీయ శాస్త్రవేత్తల ప్రతిభకు, సాంకేతిక నైపుణ్యానికి విక్రమ్1 విజయం నిదర్శనంగా నిలిచిందని పేర్కొంటున్నారు. చిత్రలేఖనంపై కూడా ఆసక్తి తన సాంకేతిక వృత్తితో పాటు నిఖిల్ మద్దూరి చిత్రలేఖనాన్ని తనకు ఎంతో ఇష్టమైన అభిరుచిగా కొనసాగిస్తున్నారు. యాక్రిలిక్ మాధ్యమంతో కాన్వాస్‌పై చిత్రాలు గీస్తున్నారు. ఆయన చిత్రాల్లో ప్రకృతి, అంతరిక్షం వంటి విభిన్న ఇతివృత్తాలు ప్రతిబింబిస్తుంటాయి.అంతరిక్ష శాస్త్రవేత్తగా దేశానికి సేవలందిస్తూ, మరోవైపు కళారంగంలోనూ తన ప్రతిభను చాటుతున్న నిఖిల్ మద్దూరి యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.



## నేటి నుండి తలకొండపల్లిలో విత్తనమేళా

**తలకొండపల్లి ,జులై 26, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల కేంద్రంలో సోమవారం నుంచి విత్తనమేల నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి రేణుక చక్రవర్తిని తెలిపారు. ఎల్ నీ నో ప్రభావం దుష్ట రైతుల అవసరం మేరకు ప్రభుత్వం గుర్తించి వారికి అవసరం మాకు విత్తనాలను నెల 27 నుంచి 29 వరకు అని తెలిపారు. వర్షాభావం తక్కువగా కురవడంతో, ఆలస్యం కావడంతో తక్కువ సమయంలో వరి పంటలను పొడి పంటలను సాగు చేసుకునే విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచినట్లు ఆమె తెలిపారు. కావలసిన రైతులు రైతు వేదిక వద్ద ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అందుబాటులో ఉంటాయని కావలసినవారు సంప్రదించాలని ఆమె కోరారు.

## నాగారం గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమం



గడ్డికి మందు పిచికారి చేస్తున్న సర్పంచ్ నిరటి లక్ష్మీ

**ధారూర్,జులై 26, ప్రభాత వార్త:** గ్రామ పరిశుభ్రత, పచ్చదనం ప్రజల సౌకర్యమే లక్ష్యంగా ధారూర్ మండల పరిధిలోని నాగారం గ్రామంలో ప్రధాన రహదారులకు ఇరువైపులా పెరిగిన గడ్డిని పూర్తిగా నిర్మూలించేందుకు మందు పిచికారీ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ నీరటి లక్ష్మీ ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. రోడ్ల పక్కన పెరిగిన పిచ్చి గడ్డి వల్ల వాహనదారులు, పాదచారులు ఎదుర్కొంటున్న ఇబ్బందికర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ ముందస్తు చర్యలు చేపట్టారు. గ్రామం పరిశుభ్రంగా, అందంగా ఉండటంతో పాటు దోమలు, విషసర్పాలు వంటి ప్రమాదకర జీవుల బెడదను తగ్గించడమే ధ్యేయంగా ఈ పనులు పూర్తి చేశారు.. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ ఏనుగుల శ్రీనివాస్, 4వ వార్డు సభ్యులు బనుహక్బర్, 6వ వార్డు సభ్యులు టేక్ కవిత మహేష్, పాపయ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నూతన కమిటి సభ్యులతో జిల్లా నాయకులు

## తెలంగాణ ఉద్యమకారుల కమిటి ఎన్నిక

**జిల్లెడు చౌదరిగూడ,జులై 26,(ప్రభాతవార్త):** తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లెడు చౌదరిగూడ మండల నూతన కమిటిని ఆదివారం ఏకగ్రీవంగ ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో నూతన కమిటి ఎన్నిక కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కమిటి అధ్యక్షుడిగా పద్మారం వెంకటేష్ యాదవ్, ఉపాధ్యక్షులుగా సలీమ్, శేఖర్, రాములు, ప్రధాన కార్యదర్శిగా రమేష్ నాయక్, కార్యదర్శులుగా బాల్‌రాజు, క్యాత్రమోని నర్సింహులు, జహంగీర్, నవీన్. నరేష్‌గౌడ్, బాల య్య, రవి, హరీశ్వర్ రెడ్డి, శివ, సలహదారుడిగా కోనేరు శ్రీనివాస్, అమృ తం ధామోదర్, గౌరవ అధ్యక్షుడిగా సాయిలు యాదవ్‌లను ఏకగ్రీవంగ ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి, టిజి శ్రీనివాస్. మంగులాల్‌నాయక్, మన్నె నారాయణ. బాబురావు, మల్లేష్ గౌడ్, భూపాలచారి, గుడిసె బాల్‌రాజు, రమేష్ నాయక్,శివకుమార్, నన్నెసాబ్ తదితరులు పాల్గొన్నారు.

## జలసిరిని విజయవంతం చేయండి

**జిల్లెడు చౌదరిగూడ,జులై 26,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలో సోమవారం నుంచి నిర్వహిస్తున్న జలసిరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిడిఓ పుష్పలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలలో జలసిరి కార్యక్రమంలో భాగంగ గ్రామస్తులకు అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ నెల 27వ తేది నుంచి 31వ తేది వరకు మండలంలోని అన్ని గ్రామాలలో జలసిరి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజా ప్రతి నిధులు, నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె సూచించారు.

## జలసిరి పై రైతులకు అవగాహన సదస్సు

ఎంపిడిఒ రవిచంద్ర కుమార్ రెడ్డి

**కేశంపేట, జులై 26, ప్రభాతవార్త:** కేశంపేట మండల పరిధిలోని రైతులకు సాగు విధానాలు పథకాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి రవిచంద్ర కుమార్ రెడ్డి తెలిపారు. ఈ సదస్సు నేటి నుండి ఈ నెల 30వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ వార్డు సభ్యులు మహిళా సంఘాల సభ్యులు మహిళా సహకార రైతులు ప్రజలు అందరికీ శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. రైతులు అధునాతన వ్యవసాయ పద్ధతులపై పూర్తి అవగాహన పెంచుకోవాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పా రు. జలసిని, ఎలినోవాల వినియోగం, వాటి ద్వారా వచ్చే ప్రయోజనాలను రైతులకు అధికారులు సవివరంగా వివరిస్తారని పేర్కొన్నారు. మండల పరిధిలోని రైతులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని, సదస్సుకు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఎంపిడిఒ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, హార్టికల్చర్ అధికారులు అగ్రికల్చర్ అధికారిల పర్యవేక్షణలో నిర్వహిస్తారని ఆయన తెలిపారు.

## ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ఒకరోజు భోజనం ఏర్పాటు

**తలకొండపల్లి, జులై 26, ప్రభాత వార్త:**తల కొండపల్లి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటుచేసిన ఉప్పల ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు ఒక పూట భోజనాన్ని తలకొండ పల్లి మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ ఏర్పాటు చేశారు. ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద తల్లిదండ్రులు లేని విద్యార్థులకు ఆదివారం నాడు తన పుట్టినరోజు సందర్భంగా పాఠశాల విద్యార్థులను సందర్శించి వారికి భోజనం ఏర్పాటు చేశారు. సందర్భంగా సీఎం శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని పాఠశాల యాజమాన్యానికి తమ ఊరికి మంచి పేరు ప్రతిష్టలు తెచ్చే విధంగా మిద్దెనభ్యసించాలన్నారు. అనంతరం మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలో గల లక్షీ ్మ నరసింహ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా మాజీ కోఆప్షన్ సభ్యులు ముజాపూర్ రహమాన్, సర్పంచులు వానరాశి రాములమ్మ వెంకటేష్, ఆర్టికల్ శేఖర్ యాదవ్, శేఖర్ యాదవ్, సుధాకర్, నిర్మల శ్రీశైలం యాదవ్, ఇమ్మడి మహేష్, బి ఆర్ఎస్ మండల అధ్యక్షులు కుమ్మరి శంకర్ మాజీ ప్రజాప్రతినిధులు లలిత జోతయ్య, వెంకటయ్య, రమేష్, యాదయ్య, శ్రీనివాసులు, శ్రీనివాసమూర్తి ,అంబాజీ, తో పాటు ఆయా గ్రామాల బి ఆర్ఎస్ కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నంది వనపర్తి కుమ్మర సంఘం ఎన్నిక

**యాచారం,జులై 26, ప్రభాతవార్త:** యాచారం మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో శాలివాహన (కుమ్మరి) సంఘం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొండాపురం శ్రీశైలం, కొండాపురం నాగరాజుల ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. గౌరవ అధ్యక్షులుగా జాపాల రవి, అధ్యక్షుడిగా కొండాపురం భాస్కర్, ఉపాధ్యక్షులుగా కొండాపురం వెంకటేష్, కొండాపురం రాజు, ప్రధాన కార్యదర్శిగా జాపాల శ్రీనాథ్, కార్యదర్శిగా కొయ్యడ నవీన్, ఆర్థిక కార్యదర్శిగా కొండాపురం శివకుమార్ లను ఎన్నుకున్నారు. సాంస్కృతిక కార్యదర్శులుగా కొండాపురం రమేష్, కొండాపురం మల్లేష్, ప్రచార కార్యదర్శులుగా కొండాపురం శ్రీకాంత్, కొండాపురం రమేష్‌లు సలహాదారులుగా కొండాపురం రాములు, దానయ్య, జంగయ్య, జంగయ్య, బాలరాజు, జాపాల రమేష్, చిన్న యాదయ్యలను నియమించారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి సంఘం నాయకులు, సభ్యులు కొండాపురం ఈశ్వర్, ,మల్లయ్య, జాపాల నర్సింహా, రమేష్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యువకులకు ఆటలు ఎంతో ఉపకరిస్తాయి

**జిల్లా యూత్ స్పోర్ట్స్ అధికారి స్వర్ణలత**

**దేవుని పడకల్లో ముగిసిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు**

**గెలు పొందిన వారికి బహుమతులు అందజేత**



**తలకొండపల్లి ,జులై 26, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న రంగారెడ్డి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు ఆదివారం నాడు ముగిసాయి. ఈషా గ్రామోత్సవం సందర్భంగా దేవుని పడకల గ్రామంలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు ఆదివారం ముగియడంతో గెలు పొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి డివైస్ ఓ జిల్లా యూత్ స్పోర్ట్స్ అధికారి స్వర్ణలత, మహేశ్వరం ఏసీబీ జానకి రెడ్డి గారు ముఖ్య అతిథులుగా హాజరైనారు. సందర్భంగా వారు మాట్లాడుతూ యువకులకు ఆటల పోటీల ద్వారా ఎంతో ఉపయోగంగా ఉంటుందని, శరీర దారుఢ్యం తో పాటు సోదర భావం పెంపొందుతుందని ఈ సందర్భంగా వారు అన్నారు.

అనంతరం ఈ పోటీలలో 32 జట్లు పాల్గొన్నాయి. మొదటి బహుమతిగా దేవుని పడకల గ్రామానికి చెందిన జట్టు పదివేల రూపాయల, పడకల్ గ్రామానికి చెందిన జట్టు రెండవ బహుమతి కింద 7000 రూపాయలు, మూడో బహుమతి కేశంపేట మండలం పాపిరెడ్డి గూడ గ్రామానికి చెందిన జట్టు మూడవ బహుమతి 3000 రూపాయలు, ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన జట్టు నాలుగో బహుమతి గెలుపొందారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కానుగుల అనిత మల్లేష్, మాజీ డిఎస్పివో వెంకటేశ్వర్లు, తల కొండపల్లి సీఐ జానకి రామ్ రెడ్డి, స్థానిక ఎస్సై శేఖర్ టీఆర్ఎస్ మండల అధ్యక్షులు కుమ్మరి శంకర్ మాజీ సర్పంచ్ శంకర్ నాయక్, ఉప సర్పంచ్ మాజీ ఎంపీటీసీ కడమోని రవి తో పాటు ఆయా గ్రామాల క్రీడాకారులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రానికే ఆదర్శంగా తీజ్ వేడుకలు



తీజ్ పండుగ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాయకులు

**కడ్తాల్, జులై 26, ప్రభాతవార్త :** గిరిజన సోదరులు అత్యంత వైభవంగా నిర్వహించిన తీజ్ వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గిరిజన సంప్రదాయ సంస్కృతిక ఆనవాయితీగా వస్తున్న ఆషాడ మాసంలో తీజ్ పండగ ప్రపంచ దేశానికి ఆదర్శంగా తీసుకోవాలని పండగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కడ్తాల్ మండలం చరికొండ గ్రామపంచాయతీ పరిధిలోని బోయిన గుట్ట తాండ, గోవిందాయపల్లి తండా గ్రామంలో తీజ్ బంజారా పండగ ఊరేగింపు ఉత్సవాల్లో ముఖ్య అతిథులుగా హాజరైన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామంలో కన్నుల పండువగా తీజ్ వేడు కలు పెద్ద ఎత్తున తీజ్ పండగ సంబరాలు ఘనంగా నిర్వహించారు. పండగ వేడుకలు సంబరాలకు రాజకీయ నాయకులు భారీ ఎత్తున పాల్గొన్నారు. నాయకులు, మహిళలు, చిన్నలు, పెద్దలు తార తమ్యం లేకుండా పెద్దలు నాయకులు, కార్యకర్తలుఅభిమానులు, యువకులు సైతం వినూత్న రీతిలో తండా యువత పెద్దలు ఆకర్షణీయమైన దుస్తులు ధరించి మహిళలు తీజ్ పండగ వేడుకలు అనందోత్సాహాలతో తండా వాతా వరణం ఆటల, పాటల గిరిజన నృత్యాలు చేస్తూ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టి పిసిసి సభ్యులు అయిళ్ళ శ్రీనివాస్ గౌడ్, మాజీ జడ్పిటిసి దశరథ్ నాయక్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోతుగంటి శంకర్, సర్పంచులు ప్రజా ప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రాంకీ డంపింగ్ యార్డును శాశ్వతంగా మూసివేయాలి

**అవగాహన సదస్సులో ఏకగ్రీవ డిమాండ్**

**జవహర్‌నగర్, జులై 26,ప్రభాత వార్త:** జవహర్‌నగర్‌లోని రాంకీ డంపింగ్ యార్డును శాశ్వతంగా మూసివేసి, ఇతర ప్రాంతాల నుంచి ఎలాంటి చెత్తను ఇకపై తరలించకూడదని వివిధ రాజకీయ, ప్రజా సంఘాలు, పర్యావరణవేత్తలు, హక్కుల సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆదివారం డీఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో జవహర్‌నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ ఆధ్వర్యంలో చైర్మన్ షేక్ షావలి, కోకన్వీనర్ ఉమామహేష్ అధ్యక్షతన నిర్వహించిన అవగాహన సదస్సులో ఈ డిమాండ్ వ్యక్తమైంది.ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ బాబురావు మాట్లాడుతూ నాలుగు మండలాల ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారిన రాంకీ డంపింగ్ యార్డును పూర్తిగా మూసివేయాలని అన్నారు. జవహర్‌నగర్ పరిసర ప్రాంతాల చెత్తను మాత్రమే నిర్వహించి, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే చెత్తను నిలిపివేయాలని పర్యావరణ ప్రొఫెసర్ లుబ్నా సర్వత్ కోరారు. ప్రతి ప్రాంతం చెత్తను అదే ప్రాంతంలో శాస్త్రీయంగా నిర్వహించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు.పౌరహక్కుల సంఘం ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, హెచ్ఆర్ఎఫ్ సంజీవ్, ఓపీడీఆర్ లక్ష్మి ్మదేవి, దమ్మాయిగూడ జేఏసీ నాయకుడు శంకర్ నారాయణ్ తదితరులు మాట్లాడుతూ డంపింగ్ యార్డు కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు.రెండో సెషన్‌లో మాట్లాడిన పలువురు నేతలు అభివృద్ధి పేరుతో ప్రజలను మోసం చేసే మాటలను నమ్మవద్దని పిలుపునిచ్చారు. హైదరాబాద్ నగరంలోని చెత్తను జవహర్‌నగర్ ప్రజలపై మోపడం అమానుషమని, ఇది ప్రజల జీవించే హక్కుకు విరుద్ధమని విమర్శించారు. శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, హక్కుల సంఘాల సూచనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని రాంకీ డంపింగ్ యార్డును శాశ్వతంగా మూసివేయాలని డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, అవసరమైతే పోరాట కమిటీ చేపట్టే ఉద్యమాలకు తమ మద్దతు ఉంటుందని ప్రకటించారు.విరసం నేత ప్రొఫెసర్ సి. ఖాసీం మాట్లాడుతూ లక్షలాది మంది ప్రజలు ఐక్యంగా ఉద్యమిస్తేనే డంపింగ్ యార్డు మూసివేత సాధ్యమవుతుందని అన్నారు.సదస్సులో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బోసు, సీపీఎం నాయకుడు నర్సింగరావు, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకురాలు రమా, బొల్లినేని ప్రకాష్, టీపీసీసీ నాయకుడు గజ్జెల కాంతం, మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, మాజీ మేయర్ మేకల కావ్య, పీఓడబ్ల్యూతో పాటు వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.కార్యక్రమం ముగింపులో వివిధ సాంస్కృతిక సంస్థల కళాకారులు డంపింగ్ యార్డు సమస్యపై ఉద్యమ గేయాలు ఆలపించి ప్రజల్లో చైతన్యం కల్పించారు.

# పెండింగ్‌లో ఉన్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం

**-అనుమగల్ల రమేష్ కు అభినందనలు తెలిపిన గ్రామస్తులు**

**కేశంపేట, జులై 26, ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధిలోని పోమాల్‌పల్లి గ్రామంలో ప్రధాన రహదారిపై అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్‌కు సంబంధించిన మాన్‌హోల్ పగిలిపోయి, తెరిచి ఉండటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మార్గంలో ప్రతిరోజూ చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు, ద్విచక్ర వాహనదారులు రాకపోకలు సాగిస్తుండటంతో ప్రమాదం జరిగే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా రాత్రి సమయాల్లో మ్యాన్ హోల్ కనిపించకపోవడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారుఈ సమస్యను పరిష్కరించాలని గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్‌తో పాటు గ్రామ పంచాయతీ సిబ్బంది దృష్టికి స్థానిక ప్రజలు పలుమార్లు తీసుకెళ్లినప్పటికీ, సమస్య పరిష్కారం కాకపోవడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని గ్రామస్తులుకేశంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అనుమగల్ల రమేష్ దృష్టికి తీసుకువెళ్లగా రమేష్ సూచన మేరకు, స్థానిక పోమాల్‌పల్లి యువకులు ముందుకు వచ్చి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ మాన్‌హోల్ మరమ్మతు పనులను చేపట్టి సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపారు. ప్రజల సమస్యలను అధికారులు పట్టించుకోకపోయినా, ప్రజల పక్షాన నిలబడి యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పనులు చేపట్టడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు.ప్రజలకు అత్యవసరమైన మౌలిక వసతుల సమస్యలను నెలల తరబడి పెండింగ్‌లో పెట్టడం సరికాదని, గ్రామ పంచాయతీ అధికారులు ఇకనైనా స్పందించి గ్రామంలోని పెండింగ్ పనులన్నింటినీ వెంటనే పూర్తి చేయాలని స్థానిక ప్రజలు, యువత డిమాండ్ చేశారు. ప్రజలకు ప్రమాదకరంగా ఉన్న మాన్‌హోల్స్, డ్రైనేజీలు, రోడ్లు మరియు ఇతర మౌలిక వసతుల సమస్యలను నిర్లక్ష ్యం చేస్తే సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులపై ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.ప్రజల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష ్యం చేసే వారిపై బాధ్యతను నిర్ణయించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు మరియు యువత డిమాండ్ చేస్తున్నారు.



డ్రైనేజీ సమస్యను పరిష్కరించిన దృశ్యం



చౌదరిగూడ దుర్గమ్మ ఆలయాన్ని సందర్శించి పూజలు చేసిన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వజ్రేశ్ యాదవ్ తదితరులు.

## చౌదరిగూడలో
# ఘనంగా బోనాల ఉత్సవాలు

**ఘట్‌కేసర్ రూరల్, జులై 26, ప్రభాత వార్త:** పోచారం డివిజన్ చౌదరిగూడలో ఆదివారం తెలంగాణ సంస్కతికి ప్రతీకగా నిలిచే బోనాల ఉత్సవాలు ఘనంగా కన్నుల పండుగగా జరిగాయి. గ్రామంలోని దుర్గమ్మ అమ్మవారితో పాటు మైసమ్మ, మహంకాళమ్మ తదితర అమ్మవార్లకు బోనాల వేడుకలు నిర్వహించారు. బోనాల ఉత్సవాల వేడుకల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. దుర్గమ్మ ఆలయాన్ని సందర్శించి పూజలు చేసిన వారిలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే ఎం. సుధీర్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ ఎం. శరత్‌చంద్రారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు వేముల మహేశ్ గౌడ్, పోచారం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కర్రె రాజేశ్, స్థానిక కాంగ్రెస్ నాయకులు భోజిరెడ్డి, పసులాది నర్సింగ్‌రావు ముదిరాజ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వై. సుదర్శన్‌రెడ్డి, బీఆర్ఎస్ మాజీ మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు అబ్బవతి నర్సింహ, ఈశ్వర్, మల్లేశ్, కాంగ్రెస్ నాయకులు పాలడుగు అమరేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ బాస్కర్ రెడ్డి, మాజీ వార్డు సభ్యుడు సుధాకర్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కె. వినోద్ కుమార్, శ్రీనివాస్ గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు దేశం ప్రభాకర్, మల్లేశ్, శివ, ఈశ్వరయ్య, సురేశ్, చింటూ, నగేశ్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పాముకాటుకు గురై వ్యక్తి మృతి

**దౌల్తాబాద్,జులై 26,ప్రభాతవార్త:** పాముకాటుకు గురై ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయిన సంఘటన వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండలంలోని ఈర్లపల్లి గ్రామంలో శనివారంరోజు రాత్రి చోటుచేసుకుంది.స్థానికులు,కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని ఈర్లపల్లి గ్రామానికి చెందిన ఫకీర్ ఖాజాషా(బాబు)57,(తండ్రి:ఉషన్ సాబ్) శనివారం ఉదయం రోజులాగానే పొలానికి వెళ్లి తన వ్యవసాయ పనులను ముగించుకుని సాయంత్రం సమయంలో పశువులకు మేత వేస్తుండగా ఆయన చేతికి పాము కాటు వేసింది.దీనిని గమనించిన ఫకీర్ ఖాజాషా వెంటనే గ్రామంలోని తన ఇంటికి చేరుకున్నారు.అనంతరం స్థానికుల సహాయంతో గ్రామ సమీపంలోని ప్రైమరీ స్కూల్ వద్ద ఉన్న ఓ ఆర్ఎంపీ డాక్టర్ వద్దకు వెళ్లి ప్రాథమిక వైద్యం చేయించుకుని ఇంటికి చేరుకున్నారు.అయితే,కొద్దిసేపటికే ఆయన పరిస్థితి విషమించడంతో,స్థానికుల సహాయంతో కుటుంబ సభ్యులు వెంటనే కోస్గి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అక్కడ ఆయనను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందారని ధృవీకరించారు.అనంతరం పోస్టమార్టం నిమిత్తం మృతదేహాన్ని కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.కుటుంబ సభ్యుల ఫిర్యాధు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు దౌల్తాబాద్ ఎస్సై వేణుకుమార్ తెలిపారు.కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న వ్యక్తి ఇలా అకస్మాత్తుగా మరణించడంతో ఈర్లపల్లి గ్రామంలో,ఆ కుటుంబంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.



ఫకీర్ ఖాజాషా (ఫైల్ ఫోటో)

## పార్టీ అభివృద్ధికి పనిచేస్తా

**రాణా ప్రతాపరెడ్డి**

**కందుకూరు, జులై 26, (ప్రభాతవార్త):** కందుకూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా ఎన్నికైన కోర్పోలు రాణా ప్రతాప్ రెడ్డి ఆదివారం పిసిసి జనరల్ సెక్రెటరీ ఏనుగు జంగారెడ్డితో కలిసి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తో పాటు పలు ప్రజాప్రతినిధులను కలిసి ధన్యవాదాలు తెలిపారు. పెద్దల సహకారంతో కందుకూరు మండలంలో కాంగ్రెస్ పార్టీని అజేయ శక్తిగా నిలుపుతామని గ్రామస్థాయి నుండి మండల స్థాయి వరకు నాయకులతోనూ కార్యకర్తలతోనూ సమన్వయంగా ముందుకు సాగి ప్రజా సమస్యలను పరిష్కారంలో ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందేలా పనిచేయడం జరుగుతుందని పెద్దలకు విన్నవించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పార్టీ ఇచ్చిన అవకాశాన్ని సద్వి నియోగం చేసుకొని ప్రజలకు సేవలు అందించాలని ప్రభుత్వానికి అండగా నిలిచేలా ప్రజలను తమ వైపు నడిపించాలని సూచించారు నాయకులు ఎవరైనా ప్రజలకు సేవ చేస్తే నాయకునిగా ప్రజాప్రతినిధిగా చిరస్థాయిగా నిలిచిపోతారని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణా నాయక్, మాజీ ఉప సర్పంచ్ గంగుల ప్రభాకర్ రెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా జనరల్ సెక్రెటరీ ఎండి అఫ్జల్ బేర్, వార్డు సభ్యులు పరికిపల బాబు, సర్పంచ్ విశ్లవ సీను నాయక్, సీనియర్ నాయకులు బి పాండురంగారెడ్డి, వత్తుల రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల చేయూత



కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

**కేశంపేట, జులై 26, (ప్రభాతవార్త):** కేశంపేట మండల పరిధిలోని కాకునూరు గ్రామానికి చెందిన సొంటె శంకరమ్మ ఆదివారం తెల్లవారు జామున దాదాపు మూడు గంటల సమయంలో ఆకస్మికంగా మృతి చెందారు. శంకరమ్మ మృతి చెందిన విషయాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా తెలుసుకున్న కేశంపేట తాజా మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి మృతురాలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ తక్షణమే ఐదువేల రూపాయల ఆర్థిక సహాయాన్ని గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుల ద్వారా అందజేశారు. వారితోపాటు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు 5000 రూపాయలు, మొత్తంగా 10000 వేల రూపాయలు మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ మా కుటుంబ ఆర్థిక పరిస్థితిని గ్రహించి గొప్ప మనసుతో ఆర్థిక సాయం అందించిన కేశంపేట మాజీ జెడ్పిటిసి తండ్ర విశాల శ్రవణ్ రెడ్డికి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు కోదూరు నరసింహులు, మహాలింగేశ్వర స్వామి దేవస్థాన కమిటీ చైర్మన్ ఎదిరేమల్లేష్, మాజీ మండల కి సాన్ సెల్ అధ్యక్షులు కోదూరు రాములు, పంది లింగమయ్య, గోపని భీమయ్య, సొంటె మల్లేష్, సొంటె చెన్నయ్య, పోరండ్ల మల్లేష్, పోరండ్ల సాయిలు, సొంటే రామయ్య, కోడి గంటి బాలయ్య, తాళ్ల నరసింహులు గౌడ్, కోదూరు శ్రీశైలం, ఎదిరే శ్రీశైలం, గజ్జ శంకరయ్య, గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేద ప్రజలకు వరం

**-సర్పంచ్ పల్లె ఆనంద్ కుమార్**



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న సర్పంచ్ ఆనంద్ కుమార్

**కేశంపేట, జులై 26, ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేద ప్రజలకు వరం లాంటిదని కొండారెడ్డిపల్లి సర్పంచ్ పల్లె ఆనంద్ కుమార్ అన్నారు. కేశంపేట మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన జటావత్ బన్ని భార్య బోజ్యా నాయక్ గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో హాస్పిటల్ లో చికిత్స పొందుతూ ఉండడంతో సర్పంచ్ ఆనంద్ కుమార్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన ఆయన బాధ్యత కుటుంబానికి తోడ్పాటును అందించాలన్న ఆలోచనతో ముఖ్యమంత్రి సహాయనిది ద్వారా 60000 వేల రూపాయల చెక్కును ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు ఇప్పించడం జరిగింది. ముఖ్య మంత్రి సహాయ నిధి నుండి డబ్బులు వచ్చేందుకు కృషి చేసిన గ్రామ సర్పంచ్ పల్లె ఆనంద్ కుమార్‌కు బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి శేఖర్, ఉడిత్యాల వెంకటేష్ గ్రామస్తులు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోండి

**మండల విద్యాధికారి చంద్రశేఖర్**

**కేశంపేట, జులై 26, ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధిలోని పాఠశాలల్లో కంప్యూటర్ విద్యను సమర్థవంతంగా నిర్వహించేందుకు తగిన అర్హతలు కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి (ఎంఈఓ) చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.

వివరాలు:అర్హత: బీటెక్, బీఎస్సీ కంప్యూటర్, పీజీ, డి సి ఏ, ఎంసీఏ డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.

బాధ్యతలు: పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్ సెక్షన్లు నిర్వహించడం మరియు బోధన అందించడం.ఆసక్తి మరియు అర్హత కలిగిన అభ్యర్థులు తమ వివరాలతో 28.7.2026 మధ్యాహ్నం వరకు త్వరితగతిన దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం ఎంఈఓ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన సూచించారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

**ఎస్ఎఫ్ఐ,డివైఎఫ్ఐ రైతు సంఘాల డిమాండ్**

**కొడంగల్,జులై 26,ప్రభాతవార్త:** కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రిలోఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులు వెంటనే భర్తీ చేఎంఆర్ఐ సిటిస్కాన్ ఏర్పాటుతో పాటు ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పించాలని ఎస్ఎఫ్ఐ,డివైఎఫ్ఐ,రైతు సంఘం నాయకులు .ఇల్లా కార్యదర్శి మహిపాల్,సతీస్, వెంకట్రామ్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు రాజుకుమార్,గురువయ్య తదితరులు డిమాండ్ చేశారు. వారం కొడంగల్ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు.సర్వే సందర్భంగా అనేక రకాల సమస్యలు తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు.ఆయా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.ప్రధానంగా డాక్టర్ పోస్టుల భర్తీతో పాటు ఔట్‌సోర్సింగ్ కార్మికులకు రెగ్యులర్ వేతనాలు అందిస్తు ఈఎస్ఐ ,పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు.ప్రభుత్వ ఆసుపత్రిలో మరుగుదొడ్లు,తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు.అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుతూ స్పెషలిస్టు డాక్టర్‌లను నియమించా లన్నారు.అలాగే బ్లడ్ బ్యాంకు ఏర్పాటుతో పాటు ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేయాలని కోరారు.ఆసుపత్రిలో ఉచిత అంబులెన్స్ సౌకర్యం ఏర్పాటుతో పాటు డెలివరీ పెషంట్లకు కిట్‌లు అందించాలని రైతు సంఘం అద్వర్యంలో డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.



ఆసుపత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

# సాగునీరు అందే వరకు పోరాటం చేస్తూనే ఉంటాం



**షాద్‌నగర్, జులై 26, ప్రభాతవార్త :** కర్ణాటక ప్రభుత్వం కృష్ణా, భీమా నదులపై నిర్మిస్తున్న అక్రమ చెక్‌డ్యాంలు, బ్యారేజీలు, రిజర్వాయర్లను బీఆర్ఎస్ నాయకుల బృందం ఆదివారం పరిశీలించింది. మాజీ మంత్రులు వి. శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డితో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పలువురు సీనియర్ నాయకులు ఈ పర్యటనలో పాల్గొన్నారు. షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ కూడా బృందంతో కలిసి కృష్ణా, భీమా నదుల పరిధిలోని ప్రాజెక్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. కర్ణాటక ప్రభుత్వం కృష్ణా, భీమా నదులపై అక్రమంగా నిర్మిస్తున్న ప్రాజెక్టులు, చెక్‌డ్యాంలు, బ్యారేజీల కారణంగా తెలంగాణకు రావాల్సిన నదీ జలాలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోందని ఆరోపించారు. హైడ్రాలిక్ గేట్లు ఏర్పాటు చేసి నీటి ప్రవాహాన్ని అడ్డుకోవడం వల్ల తెలంగాణ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఆర్డీఎస్ పరిధిలో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు చేపడుతున్న అక్రమ ప్రాజెక్టుల కారణంగా తుంగభద్ర జలాలు తెలంగాణ వైపు రావడం లేదని బీఆర్ఎస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే నీటి కొరతతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పంటలు ఎండిపోతున్నాయని, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కర్ణాటక నుంచి నీటి ప్రవాహం నిలిచిపోతే రానున్న యాసంగి సీజన్‌లో తెలంగాణ రైతులు పంటలు సాగు చేసుకునే పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ రైతులకు జరుగుతున్న నష్టంపై రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్పందించి కర్ణాటకలో నిర్మిస్తున్న అక్రమ ప్రాజెక్టులపై చర్యలు తీసుకునేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. రైతులకు సాగునీరు అందే వరకు బీఆర్ఎస్ పార్టీ తరఫున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. పర్యటనలో భాగంగా కృష్ణా, భీమా నదులపై నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు, బ్యారేజీలు, చెక్‌డ్యాంల వద్ద వాస్తవ పరిస్థితులను పరిశీలించినట్లు తెలిపారు. పరిశీలన అనంతరం పూర్తి వివరాలతో ప్రభుత్వానికి నివేదిక సమర్పించి, తెలంగాణ రైతుల పొలాలకు సాగునీరు అందేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు.

# దివ్యాంగుల సాధికారతే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి అడ్లూరి లక్ష్మణ్

**జూబ్లీహిల్స్, జులై 26, ప్రభాతవార్తః**
దివ్యాంగుల సంక్షేమం, సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సాధికారత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. దివ్యాంగులను సమాజంలో స్వావలంబన దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. యూసుఫ్‌గూడలోని మహమూద్ ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో హ్యుందాయ్ మొబిస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన యాక్సెసిబిలిటీ అండ్ ఫ్రీడమ్ కార్యక్రమంలో ఆయన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వల్లాల నవీన్ యాదవ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణలోని వివిధ జిల్లాలకు చెందిన 90 మంది దివ్యాంగులకు నియో ఫ్లై బోల్ట్ పవర్ వీల్‌చైర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వంతో పాటు కార్పొరేట్ సంస్థలు కూడా సామాజిక బాధ్యతలో భాగంగా దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపే కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచడంతో పాటు వారి స్వతంత్ర జీవనానికి తోడ్పాటునిస్తాయని చెప్పారు. దివ్యాంగుల అవసరాలను గుర్తించి వారికి అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మాట్లాడుతూ దివ్యాంగులను సానుభూతితో కాకుండా సమానత్వ దృక్పథంతో చూడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు చిన్న శ్రీశైలం యాదవ్, జాతీయ దివ్యాంగుల హక్కుల సంఘం అధ్యక్షుడు తుడుం రాజేందర్, దివ్యాంగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షఫీ అహ్మద్ ఖాన్, ప్రభాంజన్, సీఎస్ఆర్ ప్రతినిధి జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అడ్లూరి లక్ష్మణ్, నవీన్‌యాదవ్, హ్యుందాయ్ మొబిస్ ప్రతినిధులు



## యువ ఏరోస్పేస్ శాస్త్రవేత్తకు అభినందనలు

**షాద్‌నగర్, జులై 26, ప్రభాతవార్త :** భారత ప్రైవేట్ అంతరిక్ష రంగంలో చారిత్రక విజయాన్ని సాధించిన స్కైరూట్ ఏరోస్పేస్‌కు చెందిన విక్రమ్1 రాకెట్ విజయయాత్రలో కీలక పాత్ర పోషించిన షాద్‌నగర్‌కు చెందిన యువ ఏరోస్పేస్ శాస్త్రవేత్త నిఖిల్ మద్దూరిని జాతీయ బీసీ సేన నాయకులు ఆదివారం షాద్‌నగర్ పట్టణంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. యువ శాస్త్రవేత్తగా అంతరిక్ష రంగంలో నిఖిల్ మద్దూరి సాధిస్తున్న విజయాలు షాద్‌నగర్ ప్రాంతానికే కాకుండా తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని సన్మానించిన నాయకులు పేర్కొన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి దేశానికి సేవలందించాలని ఆకాంక్షి ంచారు. ఈ సన్మాన కార్యక్రమంలో జాతీయ బీసీ సేన రాష్ట్ర అధ్యక్షులు వరప్రసాద్, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షులు సుప్ప ప్రకాష్, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి, షాద్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్యాట జయ శ్రీకాంత్, రంగారెడ్డి జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు గిరిబాబు, హాజీపల్లి మాజీ సర్పంచ్ సింగారం శ్రీనివాస్, భువనచంద్ర తదితరులు పాల్గొని నిఖిల్ మద్దూరిని అభినందించారు.

## ప్రపంచంలోకెల్లా గొప్పది వైద్యవృత్తే : ప్లానింగ్ బోర్డు వైస్‌చైర్మన్ డా. చిన్నారెడ్డి

**నాంపల్లి, జులై 26 ప్రభాతవార్త :** ప్రపంచంలోకెల్లా ఎంతో గొప్పనైనది వైద్యవృత్తేనని, జీవులకు ప్రాణం పోసేది భగవంతుడైతే ఆ ప్రాణాన్ని నిలిపేది వైద్యుడేనని అలాంటి వైద్యులకు అవార్డులతో సన్మానం చేసుకోవడం గొప్పవిషయమని తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్‌చైర్మన్ డా. జి.చిన్నారెడ్డి మనవి చేశారు. ప్రముఖ సామాజిక సేవాసంస్థ మథర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బొగ్గులకుంట తెలంగాణ సారస్వత పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళావేదికలో వైద్యరత్న పురస్కారాల ప్రదానోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ డా. జి.చిన్నారెడ్డి గౌరవ అతిథులు మాజీ కేంద్రమంత్రి సముద్రాల వేణుగోపాలాచారి, న్యాయవాది సిహెచ్.రఘురామారావు, డా. ఎ.వి.స్వామి, కంజెర్ల ఈశ్వరాచారి, డా. వర్ణ, డా. భువన, సంస్థ అధ్యక్షుడు ఎం.మల్లికార్జునరావు, కార్యనిర్వాహక కార్యదర్శులు రాఘవ, సాయినాథ్, సాయికుమార్ తదితరులతో కలిసి విశ్వవిఖ్యాత వైద్యుడు డాక్టర్ బి.సి. రాయ్ స్మారకార్థం ప్రతీ సంవత్సరం ఈరోజున జరుపుకునే జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్యరత్న పురస్కారాలతో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అంకెనపల్లి మల్లికార్జునరావు సన్మానించి గౌరవించడం మంచి సంప్రదాయమని కొనియాడారు. అనంతరం వైద్య రంగంలో సమాజంలో అనారోగ్యులకు అత్యుత్తమ వైద్యసేవలు అందిస్తున్న పలువురు ప్రముఖ డాక్టర్లను వైద్యరత్న పురస్కారంతో సత్కరించి పురస్కార గ్రహీతలైన డాక్టర్లను, వారి వైద్యసేవలను శ్లాఘించి శుభాభినందనలు తెలిపారు.



వైద్యరత్న పురస్కారగ్రహీతలైన డాక్టర్లతో చిన్నారెడ్డి, వేణుగోపాలాచారి, ఈశ్వరాచారి, ఎ.మల్లికార్జునరావు, రాఘవ తదితర అతిథులు

# భూగర్భజలాలు పెంపొందించేలా కృషి చేయాలి

**యూసుఫ్‌గూడ, జులై 26, ప్రభాతవార్త :**
నీటిని పొదుపుగా వాడుకోవడంతో పాటు భూగర్భ జలాలు పెంపొందించాలంటే ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని జలమండలి డిప్యూటీ జనరల్ మేనజర్ చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో మోతీనగర్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ హెచ్‌ఎండబ్ల్యూఎస్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందరన్భంగా డీజీఎమ్ మాట్లాడుతూ మోతీనగరన ప్రాంతం నుంచి అత్యధికంగా వాటర్ ట్యాంకులు బుకింగ్ జరుగుతుందని ఇప్ప టికీ బుకింగ్‌లు జరుగుతూనే ఉన్నాయని అలా కాకుండా ప్రతి అపార్ట్‌మెంట్ వ్యక్తిగత గృహ యజమానులు వర్షపునీటి సంరక్షణ కోసం ఇంకుడు గుంతలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. అవగాహన సదస్సుకు హాజరైన అపార్ట్‌మెంట్ వాసులు, వ్యక్తిగత గృహ యజమానులు ప్రతి ఒక్కరు హార్వెస్టింగ్ నిర్మాణాలను ఏర్పాటు చేసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం హౌసింగ్ సొసైట్ అధ్యక్షులు డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ సొసైటీ ఆధ్వర్యంలో మోతీనగర్ 12 ప్రాంతాలలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నామని తెలిపారు. త్వరలోనే వాటి నిర్మాణానికి ఎమ్‌సీహెచ్‌ఎస్ కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు డాక్టర్ ఎస్‌వీ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి బి.సీతారామయ్య, కోశాధికారి బీఎఎస్ మూర్తి, ఉపాధ్యక్షురాలు సుధారాణి, సభ్యులు కంచర్ల శ్రీనివాసరావు,



అవగాహన సదస్సు కార్యక్రమంలో పాల్గొన్న కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ ఎస్వీ ప్రసాద్.

## బాల్యమిత్రుని కుటుంబానికి ఆర్థికసాయం

**ఘట్‌కేసర్, జులై 26, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్‌లో అకాలమరణం చెందిన బాల్యమిత్రుడు బద్రి కుటుంబానికి ఆర్థికసాయం అందజేసి మిత్రులు ఉదారతను చాటుకున్నారు. ఎదులాబాద్‌కు చెందిన గట్టగళ్ల బద్రి అనారోగ్యంతో అకాల మృతి చెందగా అతనితో చదివిన జడ్పీహెచ్ 2011-12 పూర్వ విద్యార్థులు విరాళాలు సేకరించి రూ.17 వేలు అతని కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయంగా అందజేశారు. మిత్రుని మరణంతో అతని కుటుంబాన్ని అండగా ఉండటం తమ బాధ్యత అని వారు పేర్కొన్నారు. తమకు కలిసి చదువుకొని అందరితో స్నేహపూర్వకంగా ఉండే బద్రి అకస్మికంగా చనిపోవడంతో చాలా బాధాకరమని వారు విచారం వ్యక్తం చేశారు. ఆపద సమయంతో అందించిన ఈసహాయం తమకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చిందని బద్రి కుటుంబసభ్యులు భావోద్వేగానికి లోనయ్యారు. తోటి మిత్రులు చూపిన మానవత్వం, స్నేహబంధానికి నిదర్శనంగా నిలిచిందని స్థానికులు వారిని అభినందించారు.

## 23న బోనాల జాతరకు నిర్ణయం

**జవహర్‌నగర్, జులై 26, ప్రభాతవార్త:** ఆషాఢ మాసం బోనాల మహోత్సవాల సందర్భంగా బీ జే ఆర్ నగర్‌లో నిర్వహించనున్న బోనాల జాతరకు సంబంధించిన తేదీలను ఆదివారం వివిధ కాలనీల పెద్దలు, కమిటీ అధ్యక్షులు, సభ్యుల సమక్షంలో ఏకగ్రీవంగా ఖరారు చేశారు. ఈ మేరకు ఆగస్టు 23న బోనాల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మాజీ కార్పొరేటర్ పల్లపు రవి, మాజీ ఎంపీటీసీ మంజుల, బీజేఆర్ నగర్ వ్యవస్థాపకులు జింక నాగులు ముదిరాజ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాట్ల శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాట్ల వినయ్, బీఆర్ఎస్ ఫేజ్2 అధ్యక్షుడు జక్కుల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారులందరికీ గౌరవం దక్కేలా చర్యలు

**షాద్‌నగర్, జులై 26, ప్రభాతవార్త :** తెలంగాణ అమరవీరుల స్తూపం ఆవిష్కరణ సందర్భంగా నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారుల సన్మాన సభలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో కొంతకాలంగా కొనసాగుతున్న వివాదానికి తెరపడింది. ఉద్యమకారుల మధ్య నెలకొన్న అసంతృప్తి, ఉపాధ్యాయ సంఘాల మధ్య తలెత్తిన వివాదంపై షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టతనిచ్చారు. ఇకపై ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా అందరినీ కలుపుకొని కార్యక్రమాలు నిర్వహించాలని, తెలంగాణ ఉద్యమకారులందరికీ తగిన గుర్తింపు, గౌరవం అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. స్థానికంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ అమరవీరుల స్తూపం ఆవిష్కరణ కార్యక్రమం సందర్భంగా జరిగిన ఉద్యమకారుల సన్మాన సభలో ఒకే వర్గానికి చెందిన వారికే ప్రాధాన్యత ఇచ్చి, మిగతా వర్గాలను నిరక్ష ్యం చేశారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో పలువురు తెలంగాణ ఉద్యమకారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ వ్యవహారం క్రమంగా ముదిరి, ఉపాధ్యాయ జేఏసీ సంఘాల మధ్య వివాదంగా మారి చివరకు మీడియా వరకు చేరింది. ఈ నేపథ్యంలో పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఆనాటి టీచర్స్ జేఏసీ ప్రతినిధులు, తెలంగాణ ఉద్యమకారులు ఆదివారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను ఆయన స్వగృహంలో ప్రత్యేకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమ సమయంలో తాము ఎదుర్కొన్న ఇబ్బందులు, చేసిన ఆందోళనలు, ఉద్యమంలో పాల్గొన్న నాటి పరిస్థితులను ఎమ్మెల్యేకు వివరించారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని, ఉద్యమకారుల త్యాగాలను గుర్తుచేస్తూ తమ ఆవేదనను ఎమ్మెల్యే ముందు వెల్లడించారు.

## ఘనంగా గ్రామదేవతలకు బోనాలు

**ఘట్‌కేసర్, జులై 26, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్‌లో ఆదివారం బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అషాఢమాసం బోనాల సందర్భంగా వంజరి కులస్థుల ఆధ్వర్యంలో గ్రామదేవతలకు బోనాలు సమర్పించారు. గ్రామదేవతలు కట్టమైసమ్మ, పోచమ్మ, ఈదమ్మ, బంగారు మైసమ్మల అమ్మవార్ల దేవాలయాలను మామిడి, వేపాకుల తోరణాలు, పూలతో అలంకరించారు.

వంజరిబస్తీలో మహిళలు బోనాలను పసుపు, కుంకుమ, వేపాకులతో అలంకరించి డప్పుశబ్దాల మధ్య ఊరేగిం పుగా తసుకువెళ్లారు. గ్రామదేవతలను దర్శించుకొని బోనాలతో వచ్చి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. ప్రతియేటా ఆషాఢ మాసంతో వంజరి కులస్థులు గ్రామదేవతలకు బోనాలను సమర్పించడం అనవాయితీగా వస్తుందని నిర్వహకులు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎదులాబాద్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు సామల అమరేందర్, మాజీ వార్డుసభ్యురాలు సామల భవాని, సహకార సంఘం మాజీ డైరెక్టర్ గాయరు విశ్వనాథం, నాయకులు కాలేరు రామోజీ, తుదుగని రాజలింగం, సాల్వేరు రఘు, సాల్వేరు పాండు, పొత్కని మల్లిఖార్జున్‌రాజు, సామల నవీన్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

# 29న బాబా రహస్య తత్వార్థ బోధనల ఆవిష్కరణ

**-మంత్రి శ్రీధర్‌బాబు, మాజీ మంత్రి సబితారెడ్డిలకు బాబా పీఠం ఆహ్వానం**

**సరూర్‌నగర్, జులై 26 ప్రభాతవార్త:** ఆధ్యాత్మిక బోధనల ద్వారా సమాజంలో మంచి మార్పును తేవడానికి విశేష కృషి చేస్తున్న హైదరాబాద్ మీర్‌పేట్‌లోని శ్రీ ద్వారకామాయి సాయిబాబా పీఠంలో ఈ నెల 29వ తేదీన గురు పౌర్ణమిని పురస్కరించుకొని రహస్య తత్వార్థ బోధలు గ్రంథావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రథమ దత్తావతారమైన శ్రీపాద శ్రీవల్లభ వంశం 34వ తరానికి చెందిన దత్త సిద్ధాంత ఆదికర్త అయిన పీఠాధిపతి పూజ్యశ్రీ గోపాలకృష్ణానంద స్వామీజీ లోక కళ్యాణాన్ని ఆకాంక్షిస్తూ రహస్య తత్వార్థ బోధనలకు సంబంధించిన అమూల్యమైన పుస్తకాన్ని రచించారు. ఈ నేపథ్యంలో గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని మీర్‌పేట్ ప్రశాంతిహిల్స్‌లోని శ్రీ ద్వారకామాయి సాయి బాబా పీఠంలో ఈ నెల 29న జరిగే గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసే ఆధ్యాత్మిక కార్యక్రమంలో బాబా సమక్షంలో పుస్తకావిష్కరణ జరుగుతుంది. ఈ సందర్భంగా హాజరయ్యే రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, మాజీ మంత్రి, స్థానిక మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విశ్రాంత చీఫ్ సెక్రటరీ జానకి ఆర్ కొండపి తదితర ప్రముఖుల చేతుల మీదుగా రహస్య తత్వార్థ బోధనల పుస్తకావిష్కరణ జరుగుతుంది.అయితే ఈ కార్యక్రమా నికి హాజరుకావాలని కోరుతూ మంత్రికి అదే విధంగా స్థానిక ఎమ్మెల్యే,మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి పీఠాధిపతి గోపాలకృష్ణానంద స్వామీజీ ఆహ్వాన పత్రాలు అందజేశారు.



మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న దత్త సిద్ధాంత ఆదికర్త, పీఠాధిపతి గోపాలకృష్ణానంద స్వామీజీ

## ప్రజల జీవితాన్ని సుసంపన్నం చేసేవి కళలు : విశ్రాంత ఐఏఎస్ అధికారి వి.ఎన్.విష్ణు

**రవీంద్రభారతి, జులై 26 ప్రభాతవార్త :** భారతీయ శాస్త్రీయ, సంప్రదాయ, జానపద కళలు ఎన్నోరకాలుగా ప్రజాజీవితాన్ని సుసంపన్నం చేస్తాయని విశ్రాంత ఐఏఎస్ అధికారి వి.ఎన్.విష్ణు అన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ, ఏపి సాంస్కృతిక విభాగం, ఐసీసీఆర్, ఒడిస్సా సాంస్కృతికశాఖల సౌజన్యంతో ప్రముఖ సాంస్కృతిక సంస్థ కళాకృతి ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో రెండురోజులపాటు సాగే యాదాద్రి జాతీయ నృత్యోత్సవ వేడుకలు రెండోరోజు ఆదివారం నయనమనోహరంగా ముగిసాయి. ఈ ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన వి.ఎన్.విష్ణు, కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత డా. కళాకృష్ణ, ఆదాయపుపన్ను అదనపు కమిషనర్ శంకర్ పాండే, చీఫ్ కన్స్‌ట్రక్షన్ ఇంజనీర్ మీల యాగయ్య, ప్రముఖ నాట్యగురువు ఎం.భారతి తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనం చేసి నృత్యప్రదర్శనలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నేత్రపర్వంగా జరిగిన యాదాద్రి జాతీయ నృత్యోత్సవంలో కళాకృతి నృత్యాలయం శిష్యుల బృందం, అంతర్జాతీయ ఖ్యాతినార్జించిన ఒడిస్సీ నృత్య విధూషి పారోస్ లోవెన్, ప్రొఫెసర్ డా. అరుణబిక్షు కూచిపూడి నాట్యప్రదర్శన, ఒడిస్సాకు చెందిన సుదర్శన్‌రాజ్ గోటిపునా నృత్యం ప్రేక్షకులను అబ్బురపరిచాయి. అనంతరం పారోస్ లోవెన్, డా.అరుణబిక్షులకు యాదాద్రి నేషనల్ ఎక్సలెన్సీ అవార్డులను ప్రదానం చేశారు.సుదర్శన్‌రాయ్‌కు యాదాద్రి నేషనల్ అవార్డు,డా.కరుణ విజయేంద్రకు యాదాద్రి బెస్ట్ డ్యాన్స్ అకామిడేషన్ అవార్డు, వంశీరామరాజుకు యాదాద్రి బెస్ ఫెస్టివల్ డైరెక్టర్ అండ్ ఆర్గనైజర్ అవార్డు ప్రదానం చేశారు. భారతీయ కళా సం స్కృతుల పరిరక్షణ, ప్రోత్సాహం, వ్యాప్తికి అంకిత భా వం తో కొనసాగాలనే సత్సంకల్పంతో ఈ 3వ యాదాద్రి జా తీయ నృత్యోత్సవం-2026 నేటితో విజయవంతంగా ముగిసింది.



యాదాద్రి జాతీయ నృత్యోత్సవంలో ఒక దృశ్యం

# డాక్టర్ హరిచరణ్‌కు ధన్వంతరి ఎక్సలెన్స్ అవార్డుతో సత్కారం

**హైదరాబాద్, జులై 26, ప్రభాతవార్త**
రోగుల సేవ, మధుమేహ నియంత్రణ, నివారణ వైద్యం మరియు సమాజ ఆరోగ్య సేవల్లో విశిష్ట కృషికి గాను రాజ్యసభ సభ్యులు డా. కె. లక్ష్మణ్ చేతుల మీదుగా సత్కారం జరిగింది. పోలో హాస్పిటల్, సికింద్రాబాద్, సీజన్స్ హాస్పిటల్స్, అంబర్‌పేట్‌లో సీనియర్ కన్సల్టెంట్ ఫిజీషియన్, డయాబెటాలజిస్ట్ లిపిడాలజిస్టా సేవలందిస్తున్న డా.జి.హరిచరణ్‌కు వైద్య రంగంలో ఆయన అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ప్రతిష్ఠాత్మక "ధన్వంతరి ఎక్సలెన్స్ అవార్డు" ప్రదానం చేయబడింది. ఈ అవార్డును రాజ్యసభ సభ్యులు డా. కె.లక్ష్మణ్ ఆదివా రం నారాయణగూడ, కేశవ మెమోరియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్‌లో జరిగిన ఘన కార్యక్రమంలో ప్రదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని బీజేపీ డాక్టర్స్ సెల్, తెలంగా ణ రాష్ట్రం నిర్వహించింది. ఈ వేడుకకు ప్రముఖ వైద్యు లు, ఆరోగ్య నిపుణులు, ప్రజాప్రతినిధులు మరియు పలు వురు విశిష్ట అతిథులు హాజరయ్యారు. డా. హరిచరణ్ రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం, మధు మేహ నియంత్రణలో విశేష కృషి, నివారణ వైద్యంపై ప్రజల్లో అవగాహన కల్పించడం, ఉచిత వైద్య శిబిరాల ద్వారా సమాజ సేవ చేయడం, ప్రజారోగ్య పరిరక్షణకు అంకితభావంతో పనిచేయడం వంటి అంశాలను గుర్తించి ఈ అవార్డును అందజేశారు. అలాగే ఆర్టిఫిషియల్ ఇంటె లిజెన్స్ వంటి ఆధునిక సాంకేతికతలను వైద్య రంగంలో వినియోగించేందుకు ఆయన చేస్తున్న కృషి కూడా విశేష ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా డా. హరిచరణ్ గారు మాట్లాడుతూ, ఈ గౌరవాన్ని తన రోగులకు, గురువులకు, సహచర వైద్యులకు మరియు కుటుంబ సభ్యులకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు.



డాక్టర్ హరిచరణ్‌కు ధన్వంతరి ఎక్సలెన్స్ అవార్డుతో సత్కరిస్తున్న ఎంపి డాక్టర్ కె.లక్ష్మణ్

## చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

**అత్తాపూర్ జులై26,ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... హైదర్‌గూడ ప్రాంతంలో పోలీసు సిబ్బంది పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తుండగా, డయల్100 ద్వారా జానా చైతన్య ఫేజ్1 ప్రాంతంలోని రోడ్డు పక్కన ఓ గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు సమాచారం అందింది. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సుమారు 50 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో కనిపించాడు. అతని వద్ద ఎటువం టి గుర్తింపు పత్రాలు లభించలేదు. పరిసర ప్రాంత ప్రజలను విచారించినప్పటికీ అతని వివరాలు తెలియరాలేదు. వెంటనే చికిత్స నిమిత్తం అతడిని ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించారు. గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు గుర్తు తెలియని వ్యక్తి మృతికి సంబంధించి కేసు నమోదు చేసి, మృతుడి పూర్తి వివరాలు మరియు మరణానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు. మృతుడిని ఎవరైనా గుర్తించినట్లయితే రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలన్నారు.

## బోనాలకు ముస్తాబు

**నందిగామ, జులై 26, ప్రభాతవార్త :** ఆషాఢ మాసం అమ్మోరు తల్లి బోనాల వేడుకలను పురస్కరించుకొని ఆదివారం సర్పంచ్ కొమ్ము కృష్ణ , ఉప సర్పంచ్ వెంకటేష్ గౌడ్ పాలకవర్గం సభ్యులు లతో కలిసి దేవాలయాలను ముస్తాబు చేస్తున్నారు. నందిగామ మండల కేంద్రంలో ఉన్న దేవాలయాల పరిసరాలలో ట్రాక్టర్ డోజర్ సహాయంతో పిచ్చి మొక్కలు, చెత్తా, చెదారాన్ని తొలగిస్తూ మట్టిపోస్తూ శుభ్రం చేయించారు. అమ్మోరు తల్లి దేవాలయాల పరిసరాలను శుభ్రం చేయడంలో కాంగ్రెస్ మైనార్టీ యువ నాయకుడు రహమత్ అలీ పాల్గొనడం విశేషం. ఏఎంసి డైరెక్టర్ నర్సింలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## సర్ పై సమన్వయంగా పనిచేయాలి



సర్ కార్యక్రమంలో పాల్గొన్న వికాస్ మహతో, పవన్, జంగారెడ్డి

**ఎల్.బి.నగర్, జులై 26 ప్రభాతవార్త:**
కొత్తపేట డివిజన్ పరిధిలోని మారుతినగర్, భాగ్యనగర్ బ్రాహ్మణ సమాజం భవనంలో బిజెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్ హెల్ప్ డెస్క్ కార్యక్రమాన్ని ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహతో ఆదివారం సందర్శించి పరిశీలించారు. అక్కడ కొనసాగుతున్న ఓటరు నమోదు, సవరణలు, ఫారాల పంపిణీ, దరఖాస్తుల స్వీకరణ తదితర ప్రక్రియలను క్షుణ్ణంగా పరిశీలించిన జోనల్ కమిషనర్ కార్యక్రమ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమానికి వచ్చిన ప్రజలతో కూడా మాట్లాడి వారి సందేహాలను తెలుసుకుని, పలు సూచనలు చేస్తూ అవసరమైన మార్గదర్శకాలను అందించారు. ఈ కార్యక్రమంలో చైతన్యపురి మాజీ కార్పొరేటర్ లు రంగా నరసింహ గుప్తా, నాయకోటి పవన్ కుమార్ పాల్గొని, హెల్ప్ డెస్క్‌కు వచ్చిన ఓటర్లకు అవసరమైన సమాచారం అందిస్తూ సర్ ప్రక్రియను సక్రమంగా పూర్తి చేసుకునేలా దిశానిర్దేశం చేశారు. అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలను సరిచూసుకుని, అవసరమైన ఫారాలను సమర్పించి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బిజెపి అధికార ప్రతినిధి ఎలిమినేటి జంగారెడ్డి, సంబంధిత అధికారులు, బిఎల్‌ఓలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గోల్కొండ జగదాంబిక ఎల్లమ్మ బోనాలు..



వేదికపై గంగపుత్ర సంఘం అధ్యక్షులు గుర్తుల శ్రీనివాస్,ప్ర,కార్యదర్శి అనందేశీ వేణు బాబు తదితరులు..

**కార్వాన్ జులై26,ప్రభాతవార్త :**
కార్వాన్ సబ్జిమండి గంగ పుత్ర సంఘం ఆధ్వర్యంలో గోల్కొండ జగదాంబిక ఎల్లమ్మ బోనాల మహోత్సవం గోల్కొండ బోనాల మహోత్సవం భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజా కమిటీ అధ్యక్షులు కట్ట శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిమామిడి సురేష్, గంగపుత్ర సంఘం అధ్యక్షులు దోర్తుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అనందేశీ వేణుబాబు, ముత్త గోపాల్ గోపాల్, పూస రాజు, కల్వసుజాత పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక శోభతో బల్కంపేటలో జనసేన బోనాల జాతర



బోనాల జాతరలో పాల్గొన్న దృశ్యం

**సంజీవరెడ్డి నగర్, జులై 26, ప్రభాతవార్త:**
ఆషాఢ మాస బోనాల పండుగ సందర్భంగా జనసేన పార్టీ వీరమహిళల ఆధ్వర్యంలో ఆదివారం బల్కంపేట శ్రీ ఎల్లమ్మ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో "జనసేన బోనాల జాతర" నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా అలంకరించిన బోనాలతో వీరమహిళలు డప్పు వాయిద్యాలు, పోతురాజుల విన్యాసాల నడుమ భారీ ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనం సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన జనసేన నాయకులు, వీరమహిళలు రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలగాలని, తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని అమ్మవారిని ప్రార్థించారు. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ఈ ఆధ్యాత్మిక వేడుకలను ప్రజలంతా ఐకమత్యంతో జరుపుకోవడం ఆనందదాయకమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి దర్శించుకున్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**షాబాద్, జులై 26, ప్రభాతవార్త :** షాబాద్ జెడ్పీహెచ్‌ఎస్‌లో 1995, 96 విద్యా సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం సంకేపల్లిగూడ సమీపంలోని ఓ ఫామ్‌హౌస్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత కలుసుకున్న సహచరులు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆనందోత్సాహాలతో గడిపారు. ఈ కార్యక్రమానికి విశ్రాంత ఉపాధ్యాయులు జడల వీరస్వామి గౌడ్, లింగం, శ్రీనివాసరావు, శ్రీదేవి, రాఘవేంద్రరావు, కుమారస్వామి, జగదీశ్వర్, సుదర్శన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పూర్వ విద్యార్థులు తమ గురువులను ఘనంగా సన్మానించి, వారు అందించిన విద్యా బోధన, మార్గదర్శకత్వాన్ని కృతజ్ఞతతో స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ, విద్యార్థులు జీవితంలో వివిధ రంగాల్లో ఉన్నత స్థాయికి చేరుకోవడం ఆనం దంగా ఉందని, ఇలాంటి సమ్మేళనాలు స్నేహబంధాలను మరిం త బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు కుటుంబ సభ్యులతో కలిసి సాంస్కృతిక కార్యక్ర మాలు, జ్ఞాపకాల పంచుకోలు, ఫొటో సెషన్‌లో పాల్గొని ఆత్మీయంగా గడిపారు. కార్యక్రమం ముగింపులో భవిష్యత్తులో కూడా తరచూ కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు.

## చెన్నయ్యకు అంబేద్కర్ నేషనల్ అవార్డు

**షాబాద్, జులై 26, ప్రభాతవార్త :** సమాజ సేవలో విశేష కృషి చేసిన షాబాద్ మండలానికి చెందిన తోపుగొండ చెన్నయ్యకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నేషనల్ అవార్డు ప్రదానం చేశారు. బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్, అట్లూరి లక్ష్మణ్ మంత్రి చేతుల మీదుగా ఆదివారం చెన్నయ్య ఈ అవార్డును అందుకున్నారు. చేవెళ్ల-షాద్‌నగర్ జాతీయ రహదారిపై పోతుగల్ సమీపంలో ప్రమాదకరంగా ఉన్న గుంతలను సేవా దృక్పథంతో పూడ్చివేయడం ద్వారా వాహనదారుల ప్రాణాలను కాపాడేందుకు చేసిన కృషితో పాటు గ్రామాభివృద్ధి కోసం వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టినందుకు ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేపట్టే వ్యక్తులను గుర్తించి సత్కరించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాజు, మణి, చించేటి ముదంగుల ఆంజనేయులు తదితరులు పాల్గొని చెన్నయ్యను అభినందించారు.

**పూల జల్లులు కురిపిస్తూ..**

**శంకర్‌పల్లి, జులై 26, ప్రభాతవార్త :** గురువు చూపిన బాటే జీవితానికి వెలుగుబాట అని, విద్యార్థుల విజయంలో ఉపాధ్యాయుల పాత్ర చిరస్మరణీయమని శంకర్‌పల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పేర్కొన్నారు. శంకర్‌పల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1995 96 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సుమారు మూడు దశాబ్దాల అనంతరం ఆదివారం ఒకే వేదికపై కలుసుకుని భావోద్వేగభరితంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు నాగభూషణం, అలీ అదిల్ ఖాన్, అనసూయ దేవి, యాదయ్య, సత్యనారాయణ, నారాయణ, భాస్కర్, ఆఫీస్ సబ్ ఆర్డినేట్ చాంద్ సుల్తాన్‌లను పూల వర్షం కురిపిస్తూ ఘనంగా వేదికపైకి ఆహ్వానించి శాలువాలు, జ్ఞాపికలతో సన్మానించారు.

## సమాజ హితం కోసం కృషి చేయాలి

**ఘట్‌కేసర్, జులై 26, ప్రభాతవార్త:** అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కోసం అంబేద్కర్ చేసిన విశిష్ట కృషిని స్మరించుకుంటూ నేటి యువత అంబేద్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సమాజాభివృద్ధికి కృషి చేయాలని కాంగ్రెస్‌పార్టీ నాయకులు కందకట్ల సందీప్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్‌లో ఆదివారం ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లడానికి 276వ వారం నిత్యపూలమాళ కార్యక్రమం నిర్వహించారు. ఎదులాబాద్ డివిజన్ అవుషాపూర్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు సందీపరెడ్డి విచ్చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాళ వేసి నివాళులు అర్పించారు. దిల్లీలో సోనమ్‌వాంగ్చుక్ వంటి శాంతియుత ఉద్యమాలు సిజేపి వంటి ప్రజానిరసనలను అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలో ప్రజలే యాజమానులు, పాలకులు ప్రజల ప్రతినిధులు మాత్రమే అనే విషయాన్ని గుర్తుచేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. అంబేద్కర్ 60 దేశాల రాజ్యాంగాలను చదివి భారతదేశ వర్ణ వ్యవస్థని, కులవ్యవస్థను దృష్టిలో పెట్టుకొని దేశ స్థితిగతుల కారణంగా భారత రాజ్యాంగాన్ని రూపొందించారని కొనియాడారు. పిబిఐ మేడ్చల్ జిల్లా సమన్వయకర్త మీసాల అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సందీప్‌రెడ్డి అంబేద్కర్ అందించిన సేవలను, పోరాటాలను తెలియజేస్తూ ఆయన ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు.

# ఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయానికి పోటెత్తిన భక్తులు

**-అమ్మవారికి ఒడిబియ్యం,సాక,బోనాలు సమర్పణ**

**-పటిష్టమైన ఏర్పాట్లు : ఈ ఓ మనోహర్ రెడ్డి**

**బేగంపేట జులై 26,ప్రభాతవార్త :** సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయం వద్ద ఆదివారం ఆషాడ బోనాల జాతర సందర్భంగా ఆలయం భక్తులతో కిట కిట లాడింది. ఉదయం,సాయంత్రం సమయంలో అమ్మ వారిని దర్శించుకునేందుకు సమీప బస్తీల ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మ వారిని దర్శించుకున్నారు. సాక సమర్పించి, ఒడిబియ్యం సమర్పించారు. బోనాలు సమర్పించారు. దీంతో ఆలయ ప్రాంగణంలో రద్దీ కన్పించింది. మహాకాళీ మాతాకీ జై అంటూ భక్తులు నినాదాలు చేస్తూ సాక,బోనాలు సమర్పించారు. అనంతరం ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాలైన పూలతో సుందరంగా అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయంలో పటిష్ట మైన ముందస్తు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈ ఓ గుత్తా మనోహర్ రెడ్డి, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ సురిటి కామేశ్వర్, తెలియ జేసారు



# వేడుకగా మహిళలకు గోరింటాకు..

**షాద్‌నగర్, జులై 26, ప్రభాతవార్త :** ఆషాఢ మాసం సందర్భంగా షాద్‌నగర్ మున్సిపాలిటీ 14వ వార్డు కౌన్సిలర్ అందె మోహన్ వార్డులో ఫెమినా మహిళా సేవా మండలి ఆధ్వర్యంలో మహిళలు, యువతులకు మైదాకు కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీదేవి ప్రోత్సాహంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలకు ఆషాఢ మాస శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రతి ఒక్కరూ ఎల్లప్పుడూ ముత్తయిదువులుగా సంతోషంగా, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షి ంచారు. మహిళలకు మైదాకు పెట్టి ఆత్మీయంగా శుభాకాంక్షలు తెలిపారు. ఫెమినా మహిళా సేవా మండలి అధ్యక్షురాలు ఆలియా సుల్తానా మాట్లాడుతూ.. తాము పుట్టి పెరిగిన గ్రామంలో తమ పెద్దలకు మైదాకు పెట్టి వారి ఆశీర్వాదాలు తీసుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. హిందూ, ముస్లిం మహిళలు కలిసి ఆషాఢ మాస వేడుకల్లో పాల్గొనడం గంగా జమునా తహజీబ్‌కు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి శ్రీదేవి వెంట పలువురు మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఫెమినా మహిళా సేవా మండలి తరఫున ఆలియా సుల్తానా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



# ఓ ఆర్ ఆర్ పై వాహనదారుల బేజారు..!




**-టోల్ వసూళ్లే లక్ష్యం..**

**కనీస వసతులపై నిర్లక్ష్యం..**

**-సాంకేతిక సమస్యలు, సిబ్బంది కొరతతో నిత్య నరకం..**

**-నిర్వాహకుల అశ్రద్ధపై వెల్లువెత్తుతున్న ప్రజాగ్రహం..**

**సైబరాబాద్ ప్రతినిధి, జులై 26 ప్రభాతవార్త**

**మన దేశంలోని అత్యాధునిక రహదారుల్లో ఒకటిగా పేరొందిన హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) నిత్య ప్రమాదాలకు నిలయంగా మారడంతోపాటు వాహనదారుల కష్టాలకు కారణమవుతోంది.. నాలుగు శతాబ్దాలకు పైబడిన చరిత్రగల నగరంలోని ట్రాఫిక్ సమస్యను తగ్గించడంతోపాటు వేగవంతమైన ప్రయాణమే లక్ష్యంగా 17 ఏళ్ల క్రితం ప్రారంభమైన ఈ రహదారి నేడు నగర ప్రజలతోపాటు ఇతర ప్రాంతాల ప్రయాణికులకు సైతం కీలక మార్గంగా మారింది.. నిత్యం లక్షలాది వాహనాలు ఈ రహదారిపై ప్రయాణిస్తుండగా టోల్ చార్జీల పేరుతో కోట్లాదిరూపాయలు వసూలు చేసుకుంటున్న నిర్వాహకులు వాహనదారులకు కనీస సదుపాయాలు కల్పించడంలో విఫలమవుతున్నారు.. నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా ఈ రహదారి అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతూ వాహనదారులకు నిత్యనరకాన్ని చవిచూపుతున్న వైనంపై ప్రభాతవార్త ప్రత్యేక కథనం..**

నగర ట్రాఫిక్ సమస్య నుంచి ప్రజలకు ఊరట కల్పించేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో అందుబాటులోకి తీసుకువచ్చిన ఔటర్ రింగ్ రోడ్డు చారిత్రక హైదరాబాద్ మహానగరానికి మణిహారంగా మారింది. నగరం చుట్టూ 158 కిలోమీటర్ల పొడవున నిర్మించిన ఈ రహదారి ఇటీవలి కాలంలో వాహనదారులకు తలనొప్పిగా మారింది. ప్రతినిత్యం దాదాపు 2.8లక్షల వాహనాలు ప్రయాణించే ఈ ఎక్స్‌ప్రెస్‌వే నేడు సగటున 6 ప్రమాదాలు నమోదయ్యే పరిస్థితికి చేరింది. జరుగుతున్న ప్రమాదాలకు హేతువవుతున్న కారణాలను గుర్తించి నివారణ చర్యలు తీసుకోవడంలో నిర్వాహకులు విఫలమవుతున్న కారణంగా ఈ రహదారిపై ప్రయాణమంటేనే వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. కనీసం రోడ్డుపై వాహనం ఆగిపోయినప్పుడు తగిన హెచ్చరిక సంకేతాలు కూడా ఏర్పాటు చేయకపోవడం వల్ల వెనకనుంచి వచ్చే వాహనాలు ప్రమాదాలభారిన పడాల్సివస్తోంది. ప్రమాదాలు జరిగినప్పుడు, ఇంధనం అయిపోయినప్పుడు వాహనదారులకు తగిన సహాయం అందకపోవడం పెను సమస్యగా పరిణమించింది. ప్రమాదాలను తగ్గించడానికి ప్రభుత్వంలోని వివిధ శాఖల అధికారులు పోలీసు యంత్రాంగంతో కలిసి కొన్ని కీలక చర్యలు చేపట్టింది. ముఖ్యంగా 80 క్రిటికల్ స్పాట్లను గుర్తించి ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను కట్టుదిట్టం చేయాలని ప్రతిపాదించారు. ఎఐ ఆధారిత ఎలక్ట్రానిక్ మానిటరింగ్‌పై శ్రద్ధవహించాలని నిర్ణయించారు. వాహనదారులకు మొబైల్‌ద్వారా భద్రతా హెచ్చరికలు పంపడం, నిబంధనలు ఉల్లంఘించేవారికి కౌన్సిలింగ్ ఇవ్వడం, అనవసరంగా రోడ్లపై వాహనాలు నిలిపేవారిపై కఠిణ చర్యలు తీసుకోవడం వంటి ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. వాహనం ఆగినప్పుడు రిఫ్లెక్టివ్ ట్రయాంగిల్స్ పెట్టడం, హజార్డ్ లైట్లు వేయడంవంటి నిబంధనలను తప్పనిసరి చేస్తూ మార్గదర్శకాలు కూడా జారీఅయ్యాయి. ముఖ్యంగా కొందరు యువతీయువకులు ఓఆర్‌ఆర్‌పై వాహనాలు నిలిపి సెల్ఫీలు తీసుకుంటున్న సందర్భాల్లో సైతం ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తించారు. మరోవైపు ప్రమాదాల నివారణ, అత్యవసర సదుపాయాల ఏర్పాటుపై నిర్వాహకులకు తగిన సూచనలు చేసినా వాటిని అమలు చేసేందుకు వారు శ్రద్ధచూపడంలేదు. టోల్‌ట్యాక్సుల పేరిట నెలకు దాదాపు 90కోట్ల రూపాయలు వసూలు చేస్తున్న నిర్వాహకులు వాహనదారుల కనీస సదుపాయాలను విస్మరిస్తున్నారు. ఓఆర్‌ఆర్‌పై మొత్తం 22 టోల్‌ప్లాజాలు ఉండగా ఒక్క ప్లాజాలో కూడా అవసరమైన సిబ్బందిని వినియోగించడంలేదు. ఫాస్టాగ్‌లో సాంకేతిక సమస్యలు ఉత్పన్నమైనప్పుడు మ్యానువల్‌గా చార్జీ చెల్లించేందుకు వాహనదారులు నరకయాతన పడాల్సి వస్తుంది. ఈకారణంగా ఇతర వాహనదారులు సైతం ఇబ్బందిపడుతూ పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోతున్నాయి. ఇక భారీవాహనాలు తమకు కేటాయించన దారిలో వెళ్లకుండా ఫాస్ట్‌లేన్‌లో వెళ్తుండగా వాటిని నుంచి వందలాది రూపాయలు వసూలు చేస్తూ నియంత్రణను విస్మరిస్తుండడం కూడా ప్రమాదాలకు హేతువవుతోంది.

## అత్యవసర సేవలేవి..?

ఈరహదారిపై ప్రయాణిస్తూ ఏదైన వాహనం ప్రమాదం భారిన పడినా, మరమ్మతుకు లోనైనా తక్షణ సహాయం అందించే అత్యవసర సేవల లేమి స్పష్టంగా కనిపిస్తోంది. ఇలాంటి సమయాల్లో తక్షణం స్పందించాల్సిన సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో వాహనదారుల పరిస్థితి అరణ్య రోదనగా మారుతోంది. దాదాపు 160 కిలోమీటర్ల పొడవైన ఈ రహదారిపై కనీస అవసరాలైన తాగునీరు, మరుగుదొడ్లను కూడా సరిగా ఏర్పాటుచేయకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ప్రమాదాలు జరిగే అవకాశమున్న ప్రాంతాల్లో తగిన భద్రతా చర్యలను చేపట్టకపోవడం, రాత్రివేళ అవసరమైన లైటింగ్‌ను ఏర్పాటు చేయకపోవడం, దెబ్బతిన్న రిఫ్లెక్టర్లను కూడా పునరుద్ధరించకపోవడం వంటి సమస్యల కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక చిన్నపాటి వర్షం పడినా రహదారిపైనే నీరు నిలిచిపోతున్న కరాణంగా వాహనాలు తమ నియంత్రణ కోల్పోయి ప్రమాదాలభారిన పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. గతంతో పోలిస్తే విపరీతంగా టోల్ చార్జీలను పెంచిన నిర్వాకులు అవసరమైన సౌకర్యాలు, నాణ్యమైన సేవలు అందించడంలో విఫలమవుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## వాహనదారుల ప్రధాన డిమాండ్లు..

ఓఆర్‌ఆర్‌పై ప్రతి 20 నుంచి 30 కిలోమీటర్ల పరిధిలో ఒక విశ్రాంతి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, అక్కడ ఉచిత తాగునీరు, పరిశుభ్రమైన మరుగుదొడ్లను అందుబాటులో ఉంచాలని వాహనదారులు కోరుతున్నారు. ప్రమాదం జరిగినప్పుడు అత్యవసరంగా ఆంబులెన్స్, క్రేన్, మెకానిక్ సేవల వంటి సదుపాయాలను వేగవంతం చేయాలని పేర్కొంటున్నారు. రాత్రివేళ మెరుగైన లైటింగ్, సిసి కెమెరాల ఏర్పాటుతోపాటు పోలీసు పహారాను పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. వాహనదారుల సౌలభ్యంకోసం స్పష్టమైన సూచిక బోర్డులు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలంటున్నారు. ప్రమాదకర ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకోవాలని, అత్యధికంగా టోల్‌ఫీజులు చెల్లిస్తున్న వాహనదారులకు అంతర్జాతీయ ప్రమాణాలతో సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర ప్రజలతోపాటు ఇతర రాష్ట్రాలకు సైతం కీలకమైన మౌలిక వనరుగా పేరుగాంచి తెలంగాణ అభివృద్ధిలో ప్రధానపాత్ర పోషిస్తున్న ఔటర్‌రింగ్‌రోడ్డుపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించి ఇక్కడ నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

# బోనం వైభోగం

**ఆధ్యాత్మిక వాతావరణంలో గోల్కొండ బోనాల ఉత్సవాలు**

**4వ పూజకు లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు**

**వివిధ ప్రాంతాల నుంచి భారీ తొట్టెల ఊరేగింపులు**



పోతురాజుల విన్యాసాలు.

**మెహిదీపట్నం, జులై 26, ప్రభాతవార్త :** చారిత్రాత్మక గోల్కొండ కోటలో బోనాల ఉత్సవాలు ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగుతున్నాయి. భారీ తొట్టెల ఊరేగింపులు, పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, డప్పు చప్పుల నడుమ భక్తులు అమ్మవారికి బోనాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ మొక్కులు చెల్లించుకొని చల్లగా చూడు తల్లి అంటూ వేడుకుంటున్నారు. ఆషాడ మాస బోనాల ఉత్సవాలలో భాగంగా శ్రీ జగదాంబ మహంకాళి అమ్మవారికి ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం 4వ పూజను నిర్వహించారు. ఆదివారం సెలవు రోజు కావడంతో భక్తులు లక్షలాదిగా తరలిరావడంతో గోల్కొండ పరిసర ప్రాంతాలని జన సందోహంతో నిండిపోయాయి. అమ్మవారి నామస్మరణతో మారుమ్రోగాయి. ఆదివారం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో గోల్కొండ జోన్ డిసిపి రాఘవేందర్ రెడ్డి, విజయారెడ్డిలు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**భారీ తొట్టెల ఊరేగింపులు :** బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని గోల్కొండ శ్రీ జగదాంబ మహంకాళి అమ్మవారికి నగరం నలుమూలల నుంచి భారీ తొట్టెలలను సమర్పించడం ఆనవాయితీ. నాలుగో పూజ సందర్భంగా మల్లె పెల్లి, ఆగాపుర, జియాగూడ, పురానాపూల్, సబ్జీ మండి నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు భారీ తోటలను తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా లంగర్ హౌస్ లో భారీ తొట్టెలకు స్వాగత స్టేజీలను ఏర్పాటు చేసి ఘన స్వాగతం పలికారు భక్తులు. కార్వాన్ సబ్జీ మండి నుండి తీసిన భారీ తొట్టెల ఊరేగింపులో ప్రజా కమిటీ అధ్యక్షులు కట్ట శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి మామిడి సురేష్, గంగపుత్ర సంఘం అధ్యక్షులు గుర్తుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అనందేశీ వేణు బాబు, ముత్త గోపాల్, పూస రాజు, కల్వ సుజాతలు ఉన్నారు.

**ట్రాఫిక్ ఆంక్షలతో భక్తులకు తప్పని తిప్పలు**

బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ పోలీసులు గోల్కొండకు వచ్చే రోడ్లలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. దీంతో బోనాల ఉత్సవాలలో పాల్గొనే భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. ద్విచక్ర వాహనాలను సైతం కోటకు కిలోమీటర్ దూరంలోనే ట్రాఫిక్ పోలీసులు వాహనాలను నిలిపివేస్తుండడంతో నడిచి వెళ్లాల్సి వస్తుందని వాహనదారులు వాపోతున్నారు. బోనాల ఉత్సవాల సందర్భంగా అన్నదానం నిర్వహించే భక్తులు బియ్యం బ్యాగులు, కూరగాయలను కూడా ద్విచక్ర వాహనాలపై తీసుకొని పోనివ్వడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వృద్ధులు వికలాంగులను సైతం వాహనాలపై వెళ్ళనివ్వకపోవడంతో పలువరు భక్తులు ట్రాఫిక్ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# గంజాయి రవాణా చేస్తున్న తండ్రీకొడుకుల అరెస్ట్

**-12 కిలోల గంజాయి స్వాధీనం**



గంజాయిని రవాణా చేస్తున్న నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

**మలక్ పేట, జులై 26, ప్రభాతవార్త:** గంజాయి రవాణా చేస్తున్న తండ్రి కొడుకులను ఎస్టీఎఫ్, సిఅండ్ డీ అధికారులు అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి సుమారు రూ 6 లక్షల విలువగల 12 కిలోల గంజాయి, రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని మలక్ పేట్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. మలక్ పేట ఎక్సైజ్ ఇన్ స్పెక్టర్ నరేందర్ కథనం ప్రకారం మహారాష్ట్రకు చెందిన మధుకర్ వసంత్ చావన్ (68), ప్రేమ్ రాజు (18) ఇద్దరు ఒడిస్సాలోని మల్కాన్ గిరిలో గంజాయిని కొనుగోలు చేసి మహారాష్ట్రకు తరలించడానికి బస్సులో హైదరాబాద్ కు వచ్చి దిల్ షుక్ నగర్ లో బస్సు దిగారు. దీంతో విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎస్టిఎఫ్, సీఅండ్ డి ఇన్ స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, నాగరాజు, మలక్ పేట్ ఎక్సైజ్ పోలీసులు ముసారాంబాగ్‌లో వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి సుమారు 6 లక్షల విలువ గల 12 కిలోల గంజాయి, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు ఎక్సైజ్‌పోలీసు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు.

## మలక్ పేట ఇన్‌స్పెక్టర్ పై సస్పెన్షన్ వేటు

**మలక్ పేట, జులై 26, ప్రభాతవార్త:**

మలక్ పేట్ ఇన్ స్పెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న కుంభం నరసింహ సస్పెండ్ అయ్యారు. కొద్ది నెలల క్రితం డబిల్ పూర పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై మలక్ పేట్ పోలీస్ స్టేషన్ ఇన్ స్పెక్టర్ గా బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు సుల్తాన్ బజార్ పోలీస్ స్టేషన్ ఇన్ స్పెక్టర్ గా విధులు నిర్వహించారు. అక్కడ విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సస్పెన్షన్ కు గురైనట్లు తెలిసింది. కాగా డీటెక్టివ్ ఇన్ స్పెక్టర్ ధర్మరెడ్డి గిరి ఇన్చార్జి ఇన్ స్పెక్టర్ గా బాధ్యతలు చేపట్టారు.

# సనత్‌నగర్‌లో ఎస్ఐఆర్ పనులను పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి

**సంజీవరెడ్డి నగర్, జులై 26, ప్రభాతవార్త:**



దాసరం బస్తీకి చెందిన విశ్వనాథ్‌తో మాట్లాడుతున్న జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్

హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)2026 కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా శివాబాగ్ కాలనీ, దాసరం బస్తీ హట్స్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలు 139, 146, 160, 161, 162, 164 లను సందర్శించి ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను సమీక్షించిన ఆయన, బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), ఎన్నికల సిబ్బందితో మాట్లాడారు. ఓటర్ల జాబితా దోషరహితంగా ఉండేలా ఫారాలను సకాలంలో సేకరించడం, ఖచ్చితంగా డిజిటలైజ్ చేయడం, భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయడం, సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం స్థానిక నివాసితులతో మాట్లాడిన జిల్లా ఎన్నికల అధికారి, అర్హులైన ప్రతి ఓటరు సక్రమంగా నింపిన గణన పత్రాలను బీఎల్ఓలకు అందజేసి ఎస్ఐఆర్2026 కార్యక్ర మంలో చురుకుగా పాల్గొని ఖచ్చితమైన, సమగ్ర ఓటర్ల జాబితా రూపకల్పనకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# జలమండలి ప్రాజెక్ట్ పనులు..బస్తీలకు కష్టాలు



దయనీయంగా అలియాబాద్ రాజన్నబావి వెనుక గల సరస్వతీ విద్యా మందిర్ రోడ్డు

**చాంద్రాయణగుట్ట, జులై 26, ప్రభాతవార్త :** జలమండలి ప్రాజెక్ట్ విభాగం ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు స్థానికులకు శాపంగా మారాయి. చాంద్రాయణగుట్ట నియోజకవర్గం జంగమ్మెట్ సర్కిల్ పరిధిలోని పలు డివిజన్లలో సుమారు 300 కోట్ల రూపాయలతో పాత డ్రైనేజీ వ్యవస్థ స్థానంలో ఆధునిక డ్రైనేజీ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఏ బస్తీలోకి వెళ్ళినా డ్రైనేజీ పనులే కనిపిస్తున్నాయి. కొత్తగా వేసిన రోడ్లను సైతం తవ్వేసి డ్రైనేజీ పైపులు వేస్తున్నారు. పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా అస్తవ్యస్త పనులతో కానిచ్చేస్తున్నారు. తవ్వేసి రోడ్లను అలాగే నెలల తరబడి వదిలేస్తున్నారు. వాటికి ప్యాచ్ వర్క్ పనులు చేపట్టటం లేదు. ఆపని మాది కాదంటున్నారు. దీంతో నెలల తరబడిగా రోడ్లు కంకర, మట్టి దిబ్బలతో ఎగుడు దిగుడుగా మారి తిరగలేని పరిస్థితి నెలకొంది. దీనికి తోడు కచ్చామోరీలు, డ్రైనేజీలు పొంగి దయనీయంగా మారుతున్నాయి. వర్షం పడితే సమస్య జఠిలంగా మారుతుంది. ఇదే కోవలో అలియాబాద్ రాజన్నబావి, శివాజీనగర్ బస్తీలలో కొనసాగుతుంది. గత కొన్ని రోజుల క్రిందట జలమండలి ప్రాజెక్ట్ విభాగం ఆ ప్రాంతంలోని పాత డ్రైనేజీ వ్యవస్థ స్థానంలో ఆధునిక పైప్‌లైన్ నిర్మించింది. అసలే నిత్యం మురుగు పారే రోడ్డు గతుకుల మయంగా మారి దారుణంగా తయ్యారైయ్యింది. శంషీర్‌గంజ్ రోడ్డులోని శ్రీరామ్‌నగర్ కాలనీ శ్రీ తుల్జా భవానీ దేవాలయం నుండి పారే మురుగు దిగువన ఉన్న రాజన్నబావి, శివాజీనగర్ మీదుగా ఆక్కడ ఉన్న పాఠశాలల మధ్య నుండి పారుతుంది. నిత్యం ఈ సమస్యతో బాధపడే స్థానికులకు డ్రైనేజీ గోతులు తోడైయ్యాయి. మురుగుతో దుర్గంధం, దోమలు వ్యాపిస్తున్నాయి. సమీప పాఠశాలలోని విద్యార్థులు, బస్తీవాసులు పగలు, రాత్రనక దోమలతో ఇబ్బందులు పడుతు న్నారు. దోమల వృద్ధి కారణంగా అనారోగ్యం బారిన పడుతున్నట్లు వాపోతున్నారు. కనీసం ఇప్ప టికైన జీహెచ్ఎంసి, జలమండలి అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల పేరుతో సైబర్ మోసాలు

**- "డబ్బులు చెల్లిస్తే ఇల్లు కచ్చితంగా ఇప్పిస్తాం' అంటే నమ్మొద్దు : సిపి సజ్జనార్ హెచ్చరిక**

**హైదరాబాద్, జులై 26, ప్రభాతవార్త**



హైదరాబాద్‌లో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ టవర్స్ ఇళ్ల కేటాయింపు పేరిట సైబర్ మోసాలు జరిగే అవకాశముందని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనర్ హెచ్చరించారు. లబ్ధిదారుల నుంచి రూ.10,000 ముందస్తు డిపాజిట్ (ఈఎండీ) చెల్లించే ప్రక్రియ ప్రారంభం కావడంతో, సైబర్ నేరగాళ్లు నకిలీ కాల్స్, అపరిచిత లింకులతో బురిడీ కొట్టించే ప్రమాదముందని ఆయన స్పష్టం చేశారు. ఈ పథకంలో ఎలాంటి దళారులు లేదా మధ్యవర్తులకు తావులేదని, ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరుగుతుందని తెలిపారు. నిబంధనల ప్రకారం చెల్లించిన ఈఎండీ సొమ్ము భద్రంగా ఉంటుందని, ఒకవేళ ఇల్లు కేటాయించకపోతే ఆ మొత్తాన్ని దరఖాస్తుదారుడి ఒరిజినల్ బ్యాంకు ఖాతాకే ప్రభుత్వం నేరుగా తిరిగి జమ చేస్తుందని వివరించారు. "డబ్బులు చెల్లిస్తే ఇల్లు కచ్చితంగా ఇప్పిస్తాం" అని నమ్మించే వారి మాటలు నమ్మవద్దని సూచించారు. "ఈ రోజే ఆఖరు తేదీ.. వెంటనే డబ్బులు కట్టకపోతే ఇల్లు రద్దవుతుంది" అని భయపెట్టి, తొందరపాటులో నగదు బదిలీ చేయించుకోవడం నేరగాళ్ల ప్రధాన ఎత్తుగడ అని హెచ్చరించారు. వాట్సాప్ లేదా మెసేజ్‌ల ద్వారా వచ్చే అపరిచిత లింకులను నమ్మి ఏపీకే ఫైళ్లను ఇన్‌స్టాల్ చేస్తే ఫోన్ హ్యాక్ అయి బ్యాంక్ ఖాతాలు ఖాళీ అవుతాయని తెలిపారు. అలాగే ప్రభుత్వ పోర్టళ్లను పోలిన నకిలీ వెబ్‌సైట్లను సృష్టించి మోసగించే అవకాశం ఉందన్నారు. గైడ్ చేస్తామనే నెపంతో 'ఎనీడెస్క్' టీమ్‌వ్యూర్ వంటి స్క్రీన్ షేరింగ్ యాప్‌లను డౌన్‌లోడ్ చేయించి బ్యాంకు వివరాలు కాజేస్తారని పేర్కొన్నారు. యూపీఐ పిన్ అనేది కేవలం డబ్బులు చెల్లించడానికి మాత్రమే ఉపయోగపడుతుందని, రీఫండ్ సొమ్మును స్వీకరించడానికి పిన్ నంబర్ నొక్కాల్సిన అవసరం లేదనే విషయాన్ని లబ్ధిదారులు గుర్తుంచుకోవాలన్నారు. అపరిచిత వ్యక్తులకు ఆధార్ కార్డుల ఫొటోలు, బ్యాంక్ వివరాలు, ఓటీపీలు పంపకూడదని హితవు పలికారు. ఈ పథకానికి సంబంధించి ఎలాంటి సందేహాలున్నా నివృత్తి చేసుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా 040-24603572 అనే హెల్ప్‌లైన్ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. ఒకవేళ పొరపాటున ఎవరైనా సైబర్ మోసానికి గురైతే, తక్షణమే పోగొట్టుకున్న సొమ్మును ఫ్రీజ్ చేసేందుకు 1930 ఉచిత హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని సీపీ సజ్జనార్ సూచించారు.

# ఉప్పల్ భగాయత్‌లో నాసిరకంగా బిటి రోడ్ల నిర్మాణం..!

**-రూ.9.60 కోట్ల నిధులు వృధా**

**- పట్టించుకోని అధికారులు**



ఉప్పల్ భగాయత్‌లో నిబంధనలు పాటించకుండా నాసిరకంగా వేసిన బిటి రోడ్ల దృశ్యం.

**ఉప్పల్, జులై 26 ప్రభాతవార్త :** ఉప్పల్ భగాయత్ హెచ్ఎండిఏ లేఔట్ బిటి రోడ్ల నిర్మాణం నాసిరకంగా వేస్తున్నారు. భగాయత్‌లో సుమారు 10 కిలోమీటర్ల బిటి రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.9.60 కోట్ల నిధులను మంజూరు చేసింది. అయితే ప్రస్తుతం జరుగుతున్న పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, సంబంధిత ఇంజినీరింగ్ శాఖ పర్యవేక్షణ లోపం కారణంగా నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదనే విమర్శలు ఉన్నాయి. భగాయత్ పరిధిలో అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు అధికారులు పలు చోట్ల బిటి రోడ్ల నిర్మాణం చేపట్టారు. దీంతో హడావిడిగా ఎటువంటి నిబంధనలు పాటించకుండా రోడ్లు వేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. హెచ్ఎండిఏ, జిహెచ్ఎంసి అధికారులపై గతంలో లోకాయుక్త కోర్టు ఆగ్రహించడంతో, ప్రభుత్వం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అయితే అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా బిటి రోడ్లను చేపట్టిన కాంట్రాక్టర్ పలు చోట్ల నాసిరకంగా, ఎటువంటి నాణ్యత ప్రమాణాలు లేకుండా రోడ్లు వేస్తున్నారని కాలనీ నేతలు ఆరోపిస్తున్నారు. ఉప్పల్ భగాయత్ కాలనీ వాసులు మౌలిక సదుపాయాల సమస్యలపై అనేకసార్లు వినతి పత్రాల అందజేశారు. అయితే బిటి రోడ్డు వేయడానికి ముందు ఉపరితలాన్ని పూర్తిగా శుభ్రం చేయకుండా, పాత రాళ్లు, కంకర మరియు ఇతర వ్యర్థాలను తొలగించకుండా, అవసరమైన సాంకేతిక ప్రమాణాలను పాటించకుండా బిటి వేయడం జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా రాత్రి వేళల్లో రోడ్లు వేస్తున్నందువల్ల సరైన పర్యవేక్షణ లేకుండా పనులు నిర్వహించడం, నిర్మాణ నాణ్యతపై మరింత అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అభివృద్ధి పనులు కూడా నిరక్ష్యంగా వ్యవహరించడంపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ప్రజాధనాన్ని వృందా చేయకుండా వెంటనే పనులను తనిఖీ చేసి, నాణ్యతా పరీక్షలు నిర్వహించి, లోపభూయిష్టంగా చేసిన పనులను తిరిగి నిబంధనలకు అనుగుణంగా చేయించాలని, అలాగే బాధ్యులైన కాంట్రాక్టర్ మరియు సంబంధిత అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని ఉప్పల్ భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు విజ్ఞప్తి చేశారు. అధికారులు స్పందించి దీనిపై తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.